





● గుంటూరు రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద పరిస్థితి

రిజిస్ట్రేషన్లకు.. రద్దీ

● కిటకిటలాడిన కార్యాలయాలు ● నేటి నుంచి భూములకు కొత్త ధరలు
● చార్జీల సవరణతో ఎగబడిన కొనుగోలుదారులు ● ఒత్తిడి తట్టుకోలేక పలు దఫాలు మొరాయించిన సర్వర్లు

గుంటూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నూతనంగా పెరి గిన మార్కెట్ ధరలు శనివారం నుంచి అమ ల్లోకి రానున్నాయి. 29న అమావాస్య. దీంతో గురు, శుక్రవారాలు రిజిస్ట్రేషన్లకు జనం పోటెత్తారు. రిజిస్ట్రేషన్లకు వచ్చిన వారితో రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిటలాడాయి. రాష్ట్ర ప్రభుత్వం శనివారం(ఫిబ్రవరి 1) నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచనున్నట్లు ప్రకటించింది. దీంతో స్థిరాస్తులు కొనుగోలు, అమ్మకాలు చేసిన క్రయ విక్రయదారులు గురు, శుక్ర వారాల్లో రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు కార్యాలయాల వద్ద బారులు తీరారు. రెండు, మూడు రోజులు క్రితమే ఆయా దస్తావేజులు సిద్ధం చేసుకున్నప్పటికీ బుధ, గురు వారాలు అమావాస్యకావడంతో ఆయా రోజుల్లో పెద్దగా రిజిస్ట్రేషన్స్



గుంటూరు కొరిటెపాడు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో..

జరగలేదు. ఈ నేపద్యంలో ముందుగానే దస్తావేజులు సిద్ధం చేసుకున్న వారంతా శుక్రవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు క్యూ కట్టారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వేలాది దస్తావేజులు సబ్ రిజిస్ట్రార్ల టేబుళ్ళ మీదకు వచ్చాయి. మొత్తం మీద ఒక్కరోజులోనే ప్రభుత్వ ఖజానాకు కోట్లలో ఆదాయం సమకూరింది. అదే సమయంలో ఒక్కరోజు ముందు రిజిస్ట్రేషన్స్ చేసుకోవడం ద్వారా ఆయా కక్షిదారులు కొంతమేర అదనపు భారం నుంచి తప్పించుకోగలి గారు. కొన్ని ప్రాంతాల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రాత్రి 10 గంటల వరకు కూడా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరిగింది. పాత రిజిస్ట్రేషన్ చార్జీలకు చివరి రోజు కావడంతో శుక్రవారం జనం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు క్యూ కట్టారు. ఉదయం నుంచే జిల్లా వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సందడి నెల కొంది. సాధారణంగా అయితే శుక్రవారం రిజిస్ట్రేషన్లు పేలవంగా ఉంటాయి. అయితే శనివారం నుంచి పెరిగిన చార్జీలు అమల్లోకి రానుండం తో పాటు శుక్రవారం నెలపొడుపు కావడంతో శుభసూచకం అనే ఉద్దేశంతో కక్షిదారులు చివరి రోజు వరకు వేచి ఉన్నారు. దీంతో పెద్దసంఖ్యలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు దస్తావేజులు రావడంతో అధికారులు, సిబ్బంది రిజిస్ట్రేషన్ ప్రక్రియలో తలమునకలయ్యారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లా కేంద్రాలైన నరసరావుపేట, బాపట్లతో పాటు కొన్ని పట్టణ ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్లు రాత్రి వరకు కొనసాగాయి. రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో రిజిస్ట్రేషన్లు జరగడంతో సర్వర్లపై ఒత్తిడి పెరిగి పలు దఫాలు మొరాయించాయి. ఫలితంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియకు విఘాతం కలిగింది. గుంటూరు కలెక్టరేట్‌లోని ప్రధాన కార్యాలయంలో, కొరిటెపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రాత్రి వరకూ రిజిస్ట్రేషన్స్ ప్రక్రియ కొనసాగింది. ప్రధాన కార్యాలయంలో 220 దస్తావేజులు, కొరిటెపాడు కార్యాలయంలో 100 వరకు రిజిస్ట్రేషన్స్ జరిగాయి. రేపల్లె, బాపట్ల, అద్దంకి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద రాత్రి వరకు రద్దీ ఎక్కువగా కనిపించింది. అద్దంకిలో సరాసరిన రోజుకు 25 నుంచి 30 రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. అయితే శుక్రవారం 110 వరకు జరిగాయి. నరసరావుపేటలో రాత్రి 7 గంటలకు 200 పైగా రిజిస్ట్రేన్లు జరిగినట్టు అధికారులు తెలిపారు. నరసరావుపేటతో పాటు సత్తెనపల్లి, క్రోసూరు తదితర ప్రాంతాల్లో రాత్రి కూడా రిజిస్ట్రేషన్లు జరిగాయి. గురువారం నరసరావుపేటలో దాదాపు 227 రిజిస్ట్రేషన్లు జరిగినట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి.



తెనాలి రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద ఉన్న కొనుగోలు దారులు

రియాల్టీపై చార్జీల ప్రభావం

ఇప్పటికే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లా కేంద్రాలతో పాటు ప్రధాన పట్టణ ప్రాంతాల్లో దాదాపు 10 నుంచి 20 శాతం మేర చార్జీలు పెరిగాయి. సత్తెనపల్లి వంటి కొన్ని పట్టణాల్లో చార్జీలు దాదాపు రెట్టింపయ్యాయి. మిగిలిన పట్టణ ప్రాంతాల్లో వ్యాపార, వాణిజ్య కూడళ్లలో మాత్రం కొంతమేర ఎక్కువగానే పెరిగాయి. ఇప్పటికే రియల్ ఎస్టేట్ రంగం కొంత కాలంగా ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న తరుణంలో రిజిస్ట్రేషన్స్ చార్జీలు వల్ల రియల్ ఎస్టేట్ రంగంపై కొంత మేర ప్రభావం చూపుతుందని ఆయా వర్గాలు అంటున్నాయి. అంతేగాక పట్టణ ప్రాంతాల్లో ముఖ్యంగా వాణిజ్య ప్రాంతాల్లో మార్కెట్ విలువలు భారీగా పెంచడం వల్ల ప్రజావసరాలకు ప్రభుత్వం భూములు సేకరించాల్సిన తరుణంలో ప్రభుత్వంపై భారం పడే అవకాశం ఉంది.

..వరాలిచ్చేనా?



● నిధుల కేటాయింపుల కోసం ఎదురుచూపు

అమరావతి అభివృద్ధి.. తీర ప్రాంతంలో పర్యాటకం పరుగులు.. రైల్వే ప్రాజెక్టులతో పాటు ఆర్‌వోబీలు, ఆర్‌యూబీలకు అడుగులు.. కేంద్ర పథకాలతో ముడిపడి ఉన్న వివిధ కార్యక్రమాలకు నిధులు.. ఇవన్నీ కేంద్ర బడ్జెట్‌తో ముడిపడి ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో శనివారం కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ తన బడ్జెట్ ద్వారా ఇచ్చే వరాల కోసం గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లావాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు. రాజధాని అమరావతి బాధ్యత తమదేనని కేంద్రం ప్రకటించింది. అదేవిధంగా కేంద్రం మంజూరు చేసే నిధులపై ఆధారపడి మూడు జిల్లాల పరిధిలో రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారులు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఏ మేర ఆయా ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు ఉంటోందని ప్రజలు బడ్జెట్‌పై ఆశక్తి చూపుతున్నారు. కేంద్రం, రాష్ట్రంలో ఒకే ప్రభుత్వం ఉన్న నేపథ్యంలో అమృత్ పథకం ద్వారా రాజధానిలో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం చేయూత ఇవ్వాలని రాజధాని వాసులు కోరుకుంటున్నారు. ఇక పేద, మధ్యతరగతి వర్గాల ఆశలు ఏమేరకు ఆర్థిక మంత్రి నెరవేరుస్తారో మరికొన్ని గంటల్లో తేలిపోనున్నది.

కేంద్ర బడ్జెట్‌పై జిల్లా వాసుల ఆశ

● మౌలిక సదుపాయాలకు తోడ్పాటు ఉంటుందా?
● ఆర్‌వోబీలు, ఆర్‌యూబీ నిర్మాణాలకు అడుగులు పడేనా
● తీరప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి నిధుల్లో వాటా ఉండేనా
● నిధులు కేటాయిస్తే అమరావతి రాజధాని నిర్మాణం పరుగులే

గుంటూరు, బాపట్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి కేంద్రమైన గుంటూరు.. సుదీర తీర ప్రాంతంతో అలరారుతున్న బాపట్ల.. అభివృద్ధి కోసం ఎదురు చూస్తోన్న పల్నాడు జిల్లాలపై కేంద్రం కరుణించేనా అన్న విషయం మరికొన్ని గంటల్లో తేలనున్నది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర బడ్జెట్‌ని ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ శనివారం ప్రవేశ పెట్టనున్న నేపథ్యంలో నిధుల కేటాయింపులపై జిల్లావాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు. వివిధ ప్రాజెక్టులకు ఎన్నెన్ని నిధులు వస్తాయోనని ఉత్కంఠ నెలకొంది. ఇక సామాన్య ప్రజలు మాత్రం నిత్యావసర సరుకుల ధరలు తగ్గాలని కోరుకుంటున్నారు. ఈ బడ్జెట్‌లో సుంకాలు తగ్గితే కొంతమేరకు ధరలు దిగి వస్తాయని మధ్య తరగతి వాసులు ఆశిస్తున్నారు. ఎగుమతులకు ప్రోత్సాహకాలు ఇస్తే మిర్చి ధరలు పెరుగుతాయని మిర్చి రైతులు కోరుకుంటున్నారు.

● రైల్వే ప్రాజెక్టుల విషయానికి వస్తే నడికుడి - శ్రీకాళహస్తి రైలు మార్గం నిర్మాణ దశలో ఉన్నది. గత ఏడాది రూ.310 కోట్లు కేటాయించినా అందులో మూలధనం రూ.60 కోట్లు మాత్రమే. మిగతా రూ.250 కోట్లు ఎస్. ఫండ్ రూపంలో

మిగతా 8వ పేజీలో)



● అమరావతి నూతన రైలు మార్గం (106 కిలోమీటర్లు) ప్రాజెక్టు వ్యయం రూ.2679.59 కోట్లు కాగా రూ.50 కోట్ల మూలధనం ఇచ్చింది. ఈ ప్రాజెక్టు ప్రస్తుతం భూసేకరణ దశలో ఉన్నది. ఈ బడ్జెట్‌లో నిధులు ఎక్కువగా మంజూరు చేస్తే త్వరలోనే శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించడానికి అవకాశం కలుగుతుంది.

అమరావతి ఆశలు

కేంద్ర ప్రభుత్వం శనివారం బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న నేపథ్యంలో నవ్యాంధ్ర ప్రజల కలల రాజధాని అమరావతిపై ఎన్నో ఆశలు రేపుతోంది. గత బడ్జెట్లో రూ.15 వేల కోట్ల సహాయం ప్రకటించి అమరావతికి ప్రాణం పోసిన కేంద్రం ఈసారి అమరావతి అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లేలా కేటాయింపులు ఉంటాయని ఆశగా ఎదురు చూస్తున్నారు. గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలన తాలూకు ఇబ్బందులు, ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడి నవనగర నిర్మాణం పరుగులు తీయాలంటే కేంద్రం చేయూత ఎంతో అవసరమ న్నది అటు కేంద్రం, ఇటు రాష్ట్రం భావిస్తున్న నేపథ్యంలో బడ్జెట్ కేటాయింపులపైనే అందరి చూపులు ఉన్నాయి. అమరావతికి మణిహారంగా ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి భూసేకరణ, సివిల్ వర్కు లతో సహా మొత్తం ఖర్చంతా కేంద్ర ప్రభుత్వ మే భరిస్తానని ఇప్పటికే హామీ ఇచ్చింది. దాదా పుగా అలైన్‌మెంటు పూర్తి కాగా రూ.16,310 కోట్లు కేంద్రమే భరించనుంది. ఈ పరిస్థితుల్లో ఇందుకు సంబంధించి బడ్జెట్లో కొంత మేర నిధుల కేటాయింపు ఉండవచ్చని భావిస్తున్నారు. విజయవాడ తూర్పు బైపాస్‌కు కేంద్ర నో చెప్పినందున ఐఆర్‌ఆర్ విషయంలో తోడ్పాటును ఇవ్వాలన్న డిమాండ్ బలంగా ఉంది. 2014- 19 మధ్య మెట్రో ప్రతిపాదనలు తెరపైకి రాగా 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ ఊసే లేదు. కూటమి ప్రభుత్వం అధికారం లో ఉన్న నేపథ్యంలో ఈసారి కేంద్ర బడ్జెట్లో మెట్రో ప్రస్తావన ఉంటుందన్న ఆశతో రాష్ట్ర ప్రజలు ఉన్నారు. అదే విధంగా అమరావతిలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటా యిస్తే బాగుంటుందని పలువురు భావిస్తున్నారు. గతంలో అమృత్ పథకం కింద కేంద్రం అమరావతికి కొంతమేర చేయూత నిచ్చింది. వైసీపీ హయాంలో ఆ ప్రస్తావనే లేకుండాపోయింది.

కార్పొరేటర్లు.. క్యాంపులు

● హైదరాబాదులో కూటమి, వైసీపీ కార్పొరేటర్లు
● వైసీపీ క్యాంపులో 21 మందే.. హాజరుకాని మరో నలుగురు
● కార్పొరేటర్లు జారిపోవడంతో వైసీపీ నేతలు అప్రమత్తం
● రసకందాయకంగా స్టాండింగ్ కమిటీ ఎన్నికలు
● స్టాండింగ్ కమిటీలో పదవులన్నీ గెలుపొందాలని కూటమి వ్యూహం ● మేయర్‌పై అవిశ్వాసానికి స్టాండింగ్ కమిటీ ఎన్నికలే సెమీఫైనల్?

గుంటూరు కార్పొరేషన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఎన్నికల గడువు సమీపిస్తుండటం.. వైసీపీ కార్పొరేటర్లు జారిపోతుండటం.. ఆరుకు ఆరు పదవులను చేజిక్కుంచుకునేందుకు కూటమి నేతల వ్యూహాలు.. ఈ నేపథ్యంలో గుంటూరు నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు రసకందాయకంగా మారాయి. ఎలాగైనా ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించుకుని పట్టు నిలుపుకోవాలని అటు కూటమి, ఇటు వైసీపీ నేతలు పట్టుదలగా ఉన్నారు. ఇప్పటికే వైసీపీ తరఫున నామినేషన్ వేసిన కార్పొరేటర్ అడకా పద్మావతి టీడీపీలో చేరారు. దీంతో వైసీపీ ఐదు స్థానాలకే పరిమితమైంది. టీడీపీ, జనసేన మాత్రం ఆరు స్థానాల్లో పోటీలో ఉంది. ఈ క్రమంలో నేతలు వారి పార్టీలకు చెందిన కార్పొరేటర్లను హైదరాబాద్ క్యాంపులకు తరలించారు.వైసీపీ తరఫున కేవలం 21 మంది కార్పొరేటర్లు హైద రాబాద్ క్యాంపులో ఉండగా ఆ పార్టీకి చెందిన కార్పొ రేటర్లు ఎక్కలూరి మారుతీ రాణి,

(మిగతా 6వ పేజీలో



హైదరాబాద్ క్యాంపులో కూటమి కార్పొరేటర్లతో ఎమ్మెల్యే నసీర్

మిర్చియార్డు కార్యదర్శిగా చంద్రిక

● బాధ్యతల స్వీకారం.. అధికారుల అభినందనలు
● మిర్చి రైతుల శ్రేయస్సుకే ప్రాధాన్యమన్న చంద్రిక



చంద్రిక

గుంటూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మిర్చియార్డు(వ్యవసాయ మార్కెట్ కమిటీ) ఉన్నత శ్రేణి కార్యదర్శిగా చంద్రిక బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం యార్డు పరిపాలన భవనానికి వచ్చిన ఆమె చార్జి తీసుకుని ఫైలుపై సంతకం చేశారు. ఈ సంద ర్భంగా పలువురు సెక్రటరీలు, సిబ్బంది ఆమెకు పుష్ప గుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. గ్రేటర్ విశాఖపట్టణానికి చెందిన చంద్రిక 2012 గ్రూపు-1 ద్వారా మున్సిపల్ పరిపాలన శాఖలో గ్రేడ్-2 కమిషనర్‌గా ప్రభుత్వ సర్వీసులోకి వచ్చారు. ఆ తర్వాత గ్రేడ్-1, స్పెషల్ గ్రేడ్ కమిషనర్‌గా ఉద్యోగోన్నతులు పొందారు. తొలి పోస్టింగ్ బొబ్బిలి మున్సిపాలిటీలో కమిషనర్‌గా విధులు నిర్వహించారు. ఆ తర్వాత మచిలీపట్నం, బొబ్బిలి అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ, గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ లో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వహించారు. గత ఏడాది నుంచి ఆమె డిప్యూటేషన్‌పై విధులు నిర్వహించేందుకు ప్రభుత్వానికి దరఖాస్తు పెట్టుకున్నారు. కూట మి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆమె విజ్ఞప్తిని పరిశీ లించి న సీఎం చంద్రబాబు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తాజాగా గుంటూరు మిర్చి యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శిగా డిప్యూటేషన్‌పై పోస్టింగ్ అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే అతి పెద్ద మిర్చియార్డుకు సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ పదవి తనకు ఒక సవా లులాంటిదని, అందరి సహాయ, సహకారాలు తీసుకుని రైతులు, మార్కెట్ కమిటీ శ్రేయస్సు కోసం కష్టపడి పని చేస్తానన్నారు. ప్రస్తుతం మిర్చి సీజన్ ఉచ్ఛదశలో ఉందని, కచ్చితంగా నిరంతరం అప్ర మత్తంగా ఉంటూ యార్డు కార్యకలాపాలు సజావుగా, సాఫీగా జరిగేలా చర్యలు చేపడతానన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రాధాన్యమిచ్చి కార్యక్రమాలు అమ లు చేస్తామని చెప్పారు. అనంతరం సెక్రటరి చంద్రిక మార్కెటింగ్ శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ విజయ సునీత చుట్టుగుంటలోని కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. ఆ తర్వాత కమి షనరేట్ అధికారులు, జాయింట్ కలెక్టర్, మిర్చియార్డు పర్సన్ ఇన్‌చార్జి అమిలినేని భార్గవతేజని మర్యాద పూర్వకంగా కలిశారు. కాగా చంద్రికను కలిసి యార్డు కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, శ్రీకాంత్, జయరామిరెడ్డి, ఆంజనేయులు, అధికారులు నరేంద్ర, రాఘవరావు, వేమెన్ అసోసియేషన్ల నాయకులు అభినందనలు తెలిపారు.

ముగ్గురు మృతి.. ముగ్గురికి గాయాలు 6
ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీ ● స్నేహితుడి పుట్టిన రోజు కేక్ కోసం వస్తుండగా ఘటన

మహానాడుకు లోకేశ్ రక్ష 8
● రూ 294 కోట్ల వ్యయంతో కృష్ణానదికి రిటైనింగ్ వాల్

రహదారులకు.. రూ. 5,266 కోట్లు



విస్తరించనున్న దుర్గి - వెల్దుర్తి రహదారి



గోతులు మయంగా కొండమోడు రహదారి

◆ కేంద్రం నిధులతో రోడ్లకు మహర్దశ
◆ పలు రోడ్లు నాలుగు వరసలుగా విస్తరణ
◆ ఇప్పటికే కొన్ని ప్రారంభం.. మరికొన్ని వేగవంతం
◆ రాష్ట్ర రహదారులు.. జాతీయ రహదారులుగా అభివృద్ధి

(నరసరావుపేట - ఆంధ్రజ్యోతి)

రహదారుల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఈ క్రమంలోరూ.5,266 కోట్లు మంజూరుతో జిల్లా లోని రోడ్లకు మహర్దశ పట్టనుంది. రెండేళ్లలో రహదారుల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చి అభివృద్ధి చేస్తోంది. కేంద్ర రహదారి మౌలిక సదుపాయల పథకం కింద జిల్లాలోని పలు రోడ్లకు ప్రత్యేకంగా నిధులు మంజూరయ్యాయి. ఆయా రోడ్ల విస్తరణతో అటు బాపట్ల, ప్రకాశం ఇటు గుంటూరు జిల్లాలకు రవాణా సౌకర్యాలు మెరుగవుతాయి. రహదారులు వినియోగంలోకి వస్తే ప్రజా రవాణా వేగవంతమవుతోంది. ఇప్పటికే రెండు జాతీయ రహదారుల పనులు పూర్తయ్యాయి. నాగార్జున సాగర్- దావులపల్లి జాతీయ రహదారిని రూ.230 కోట్లతో 47 కిలోమీటర్ల మేర రెండు వరుసలుగా విస్తరించారు. ఇటీవల ప్రధాని మోదీ దీనిని ప్రారంభించిన విషయం తెలిసిందే.

భారత్ మాలా ప్రాజెక్టులో..

కొండమోడు-పేరేచర్ల 167 ఏజీ జాతీయ రహదారి విస్తరణకు రూ.881.61 కోట్లు మంజూరయ్యాయి. భారత్ మాలా ప్రాజెక్టు కింద పనులు చేపడుతున్నారు. 49.917 కిలోమీటర్లు నాలుగు లైన్ల రహదారిని నిర్మిస్తారు. సత్తెనపల్లి, మేడికొండూరులో బైపాస్ ఏర్పాటు చేయనున్నారు. టెండర్ల ప్రక్రియ కొలిక్కిరాగా భూసేకరణ దాదాపు పూర్తయింది. పనులకు ప్రధాని మోదీ ఇటీవల విశాఖ పర్యటనలో శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన విషయం తెలిసిందే.

రెండు ప్యాకేజీల్లో 167ఏ రహదారి..

కేంద్ర ఉపరితల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఓడరేవు - పొందుగల 167ఏ జాతీయ రహదారిని విస్తరిస్తున్నారు. బాపట్ల జిల్లా ఓడరేవు నుంచి పల్నాడు జిల్లా నకరికల్లు అడ్డరోడ్డు వరకు నాలుగు వరుసలుగా విస్తరిస్తున్నారు. 85 కిలోమీటర్లు పొడవున రూ.1,064 కోట్లతో రహదారి నిర్మాణం జరుగుతుంది. ఓడరేవు నుంచి చిలకలూరిపేట వరకు రూ.678 కోట్లతో 47 కిలో మీటర్లు రహదారి పనులను ప్యాకేజీ ఒకటి కింద చేపట్టారు. చిలకలూరిపేట నుంచి అడ్డరోడ్డు వరకు 38 కిలోమీటర్లలో పనులను రెండో ప్యాకేజీలో చేపట్టారు. మొదటి ప్యాకేజీలో పనులు వేగవంతం కాగా రెండో ప్యాకేజీలో పనులు టెండరు, భూసేకరణ దశలో ఉన్నాయి.



బొప్పూడి వద్ద ఓడరేవు రహదారి విస్తరణ పనులు

వినుకొండ నుంచి పేరేచర్ల వరకు

వినుకొండ నుంచి గుంటూరు జాతీయ రహదారి 544డీ విస్తరించేందుకు కేంద్రం నిధులు (మిగతా 6వ పేజీలో)

వర్క్‌షాపు బ్రోచర్ ఆవిష్కరణ



వర్క్‌షాప్ కరపత్రాలు విడుదల చేస్తున్న వీసీ ఆచార్య గంగాధరరావు, ఇతర అధికారులు

పెదకాకాని, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని వ్యాయామ విద్య కళాశాల ఆధ్వర్యంలో యోగ యాజ్ ఏ థెరపీటిక్ ఇంటర్వెన్షన్ అనే అంశంపై రెండు రోజుల యూజీసీ జాతీయ వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు వర్క్‌షాప్ డైరెక్టర్, వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.జాన్సన్ తెలిపారు. ఫిబ్రవరి 12, 13 తేదీల్లో ఈ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం వీసీ ఆచార్య కె. గంగాధరరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు వర్క్‌షాపు బ్రోచర్‌లను ఆవిష్కరించారు. విభాగం అధ్యాపకులు, యోగ కోఆర్డినేటర్ డాక్టర్ డి.సూర్యనారాయణ, అధ్యాపకులు డాక్టర్ రామ్మోహనరావు, డాక్టర్ కె.సత్యమూర్తి, సిబ్బంది జె.రాజేష్, ఆనంద్ కిషోర్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విజన్‌పై జాతీయ సదస్సు

పెదకాకాని, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లోని సెంటర్ ఫర్ డాక్టర్ అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 21, 22 తేదీలలో అంబేడ్కర్ విజన్ ఆన్ ఇంటర్ ప్లే ఆఫ్ సోషియో పొలిటికల్ ఎకనామిక్ ఫాక్టర్స్ ఇన్ ఇండియా అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు డైరెక్టర్, చైర్ ప్రొఫెసర్ ఆచార్య వై.అశోక్ కుమార్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సదస్సు ఫలవంతంగా జరగాలని ఆకాంక్షించారు. అశోక్ కుమార్ మాట్లాడుతూ ఈ జాతీయ సదస్సుకు పరిశోధన పత్రాలు పంపాలని సూచించారు. ఫిబ్రవరి 15వ తేదీలోగా పరిశోధకులు, అధ్యాపకులు, మేధావులు తమ పరిశోధన పత్రాలను పంపాలని కోరారు. సదస్సు కోశాధికారి డాక్టర్ కె.అబ్రహాం లింకన్, దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, విభాగం పరిశోధకులు, సిబ్బంది డాక్టర్ వి.శ్రీనివాస్, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్య బీఎల్ఐఎస్సీ ఫలితాలు విడుదల



పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వెంకటేశ్వర్లు

పెదకాకాని, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ దూర విద్యా కేంద్రం గత అక్టోబరు, నవంబరు నెలలో నిర్వహించిన బీఎల్ఐఎస్ సీ కోర్సు మొదటి, రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శుక్రవారం దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి. రామచంద్రన్ విడుదల చేశారు. ఈ ఫలితాలను దూరవిద్య కేంద్రం వెబ్‌సైట్ నుంచి పొందవచ్చునని తెలిపారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ కృష్ణవేణి, కోదండపాణి, ఉద్యోగులు టంకశాల వెంకటేశ్వర్లు, ఎల్ఎస్.రాంబాబు, కంప్యూటర్ సెక్షన్ నిర్వాహకులు వలి తదితరులు పాల్గొన్నారు.

పతన సంస్కృతిపై పోరాడుదాం

- ఏఐపీఎల్‌సీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రవిబాబు
- ఘనంగా అఖిల భారత ప్రజా సాహిత్య, కళా సాంస్కృతిక సభలు ప్రారంభం



మాట్లాడుతున్న కొత్తపల్లి రవిబాబు, పాల్గొన్న సాహితీ వేత్తలు

గుంటూరు (తూర్పు), జనవరి 31(ఆంధ్రజ్యోతి): అణిచివేత రాజకీయ పాలనకు, సనాతనం పేరుతో హీన, బానిస భావ, పతన సంస్కృతిని ప్రోత్సహిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా భావ సారూప్య ప్రజాస్వామ్య శక్తులతో ప్రత్యామ్నాయ సంస్కృతిని నిర్మించడానికి సమయం ఆసన్నమైందని ఆల్ ఇండియా పీపుల్స్ లిటరేచర్ అండ్ కల్చరల్ ఫోరం జాతీయ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రవిబాబు పేర్కొన్నారు. స్థానిక ఎన్జీవో కల్యాణ మండపంలో మూడు రోజుల పాటు నిర్వహించే అఖిల భారత ప్రజాసాహిత్య, కళా సాంస్కృతిక సభలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సభకు జాతీయ ఉపాధ్యక్షుడు దివి కుమార్ స్వాగతం పలుకుగా ఏఐపీఎల్‌సీఎఫ్ నాయకులు రమణ ప్రసాద్ అధ్యక్షత వహించారు. 'పీపుల్స్ లిటరేచర్' 11 సంచికను ఆవిష్కరించి జాతీయ ప్రధాన కార్యదర్శి రవిబాబు కీలక ఉపన్యాసం చేస్తూ ప్రపంచీకరణ నేపథ్యంలో ముంచుకొస్తున్న ఆర్థిక, సామాజిక, సాహిత్య, కళా, సాంస్కృతిక దోపిడీలకు వ్యతిరేకంగా పీడిత ప్రజల గొంతుకగా అఖిల భారత ప్రజా సాహిత్య సాంస్కృతిక వేదిక బలమైన ప్రత్యామ్నాయ సంస్థగా కృషి చేస్తుందని వివరించారు. సభలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు డాక్టర్ పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ, సీఎస్ఆర్ ప్రసాద్, కాట్రగడ్డ దయానంద్, గౌతమ్ ముఖర్జీ, సుగధన్ పాల్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆదివాసీ చిన్నారులు ప్రదర్శించిన 'బుడతల బుర్రకథ', శ్రీకాకుళోద్యమ గిరిజన పోరాట చరిత్రపై ప్రదర్శించిన 'పోరు దారి' ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని జన సాహితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి. అరుణ పర్యవేక్షించగా, ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చిత్రకళ ప్రదర్శనను ప్రముఖ చిత్రకారుడు టి.వెంకట్రావు ప్రారంభించారు.

'కూటమి' అండగా నిలవాలి

- ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాదు



మాట్లాడుతున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాదు, పక్కన తిరుపతిరావు, వల్లూరి జయప్రకాష్

గుంటూరు(తూర్పు), జనవరి 31(ఆంధ్రజ్యోతి): రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు అండగా నిలిచి భారీ విజయం చేకూర్చాలని కృష్ణా - గుంటూరు ఉమ్మడి జిల్లాల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాదు విజ్ఞప్తి చేశారు. స్థానిక లాలుపురంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్ర ప్రసాదు మాట్లాడుతూ గత ఏడు నెలలుగా చేస్తున్న అభివృద్ధిని కొనసాగిస్తామని అన్నారు. గత ఐదేళ్లలో మండలిలో జరిగిన పరిణామాలు చూస్తే తలదించుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా, ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తామని అన్నారు. కూటమిలో ఉన్న నాయకులను కలుపుకుని ముందుకు వెళ్తానని తెలిపారు. చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ ఆలపాటి గెలుపునకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. నేషనల్ కౌన్సిల్ సభ్యుడు జూపూడి రంగరాజు మాట్లాడుతూ చదువుకున్న మేధావులను ఎన్నుకుని రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని కోరారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ మిత్రపక్షంగా ఉన్న టీడీపీ, జనసేనతో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ విజయాన్ని సాధించి బహుమతిగా ఇద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొత్తూరి వెంకట సుబ్బారావు, ఈదర శ్రీనివాసరెడ్డి, భీమినేని చంద్రశేఖర్, గాజుల వెంకయ్య నాయుడు, శనక్కాయల ఉమాశంకర్, నేరెళ్ల మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారులకు.. రూ.5,266 కోట్లు


(5వ పేజీ తరువాయి)

మంజూరు చేసింది. అనంతపూర్-గుంటూరు రహదారి విస్తరణలో భాగంగా వినుకొండ నుంచి పేరేచర్ల వరకు ఉన్న రహదారిని నాలుగు వరసలుగా విస్తరిస్తారు. సుమారు 90 కిలోమీటర్ల పొడవునా రహదారిని విస్తరించేందుకు రూ.2,360 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. వినుకొండ నుంచి నరసరావుపేట మీదగా రహదారిని విస్తరిస్తారు. రహదారి విస్తరణకు కొన్ని ప్రాంతాల్లో భూసేకరణ చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు. భూసేకరణతో పాటు రహదారి పనులకు ఎన్‌హెచ్ అధికారులు సమాయత్తమవుతున్నారు.

పనులు వేగవంతం.. ప్రారంభం

- దావులపల్లి నుంచి ప్రకాశం జిల్లా మల్లాయపాలెం జాతీయ రహదారిని రెండు వరుసలుగా విస్తరించనున్నారు. రూ.312 కోట్లతో 20 కిలోమీటర్ల మేర రహదారిని విస్తరిస్తారు. ఈ పనులకు ఇటీవల మోదీ శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. పనులు ప్రారంభించేందుకు నేషనల్ హైవే అథార్టీ చర్యలు చేపట్టింది.
- దాచేపల్లి మాచర్ల రాష్ట్ర రహదారిని జాతీయ రహదారి 167ఏడీగా మార్చారు. రూ.403.22 కోట్లతో పనులు చేపట్టారు. దాచేపల్లి నుంచి గురజాల, రెంటచింతల, పాల్వాయిగేటు మీదగా మాచర్ల వరకు 37 కిలోమీటర్ల పొడవున పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. పాల్వాయిగేటు వద్ద రైల్వే ట్రాక్‌పై బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది. ఆరు నెలల్లో పనులు పూర్తి చేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు.
- సత్తెనపల్లి, గురజాల ప్రాంతాల్లో రైల్వే ట్రాక్‌లపై బ్రిడ్జిల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. సత్తెనపల్లి రెడ్డిగూడెం వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జికి రూ.57.13 కోట్లు మంజూరు చేసింది. గురజాల నియోజవర్గంలోని తుమ్మలచెరువు - నడికూడి స్టేషన్ల మధ్య రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.70.49 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులకు భూసేకరణను వేగవంతం చేశారు.
- మాచర్ల నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.117.75 కోట్లు మంజూరు చేసింది. దుర్గి నుంచి వెల్దుర్తి వరకు 17.6 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణకు రూ.31.60 కోట్లు మంజూరయ్యాయి. 8/6 కిలోమీటరు వద్ద వాగుపై బ్రిడ్జి నిర్మిస్తారు. రెంటచింతల మండలం పాలువాయి జంక్షన్ నుంచి పసర్లపాడు, జెట్టిపాలెం మీదగా సత్రశాల వరకు 11.2 కిలోమీటర్ల పొడవున రహదారి విస్తరణకు రూ.21.65 కోట్లు మంజూరయ్యాయి. ఈ రహదారిలో 2/4 కిలో మీటరు వద్ద వాగుపై బ్రిడ్జి మంజూరైంది. మాచర్ల నుంచి విజయపూరిసౌత్ వరకు 22.8 కిలోమీటర్ల రహదారి విస్తరణకు రూ.31 కోట్లు, లోయపల్లి నుంచి గొట్టిపాళ్ల, కండ్లకుంట, గుడిపాటి చెరువు మీదగా లచ్చంబావితండా వరకు 25.40 కిలోమీటర్ల రహదారి విస్తరణకు రూ.33.50 కోట్లు మంజూరయ్యాయి.

రేపే కానుకమాత తిరునాళ్ల



కానుకమాత ఆలయం

- రూ. 5 కోట్లతో ఆలయం ఆధునికీకరణ

రెంటచింతల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రఖ్యాతిగాంచిన పురాతన క్రైస్తవ ఆలయాల్లో ఒకటైన రెంటచింతల కానుకమాత దేవాలయం ఆధునికీకరణతో భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. అద్భుతమైన ఆర్కిటెక్ట్ ఇంజనీరింగ్ ప్రమాణాలతో నిర్మించిన గోపురాలు తాపీ పని వారి నైపుణ్యానికి మచ్చుతునకగా ఉన్నాయి. రెంటచింతలలో క్రైస్తవ సంఘం 18వ శతాబ్దంలోనే వెలసినట్లు చరిత్ర చెబుతుంది. 1850లో కానుకమాత చర్చిని కేవలం రూ.4 వేలతో నిర్మించారు. బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి చెందిన బ్రట్ జేమ్స్ దాసన్ క్రీస్తు ప్రార్థనా మందిరానికి పూనుకున్నారు. ఈ ఆలయంలో భక్తులు కూర్చొడానికి సరిపోకపోవడంతో 1982లో మరో ఆలయాన్ని నిర్మించి ప్రార్థనలు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ప్రస్తుతం ఆ ఆలయాన్నే రూ.5 కోట్లతో పునర్నిర్మించారు.కేవలం రెండు పిల్లర్లతో ఈ ఆలయ నిర్మాణం జరగడం విశేషం. గోపురాలు 50 అడుగులుండగా ప్రధాన గోపురం 100 అడుగుల ఎత్తులో ఉంది. రెంటచింతల అనాదిగా క్రైస్తవ మతానికి ఆలంబనగా ఉంది. ఆధ్యాత్మికతకే పరిమితి కాకుండా విద్యాలయాలు, సాగునీటి కాలువలు అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

భారీ ఎత్తున ఏర్పాట్లు



ఫాదర్ మర్రెడ్డి

ఫిబ్రవరి 2న కానుకమాత దేవాలయం 175వ తిరునాళ్లను ఘనంగా జరపడానికి భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు ఫాదర్ వైఎల్ మర్రెడ్డి చెప్పారు. 1వ తేదీ 20 వేల మందికి అన్నదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం జరిగే తిరునాళ్లకు ముఖ్యఅతిథులుగా బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య, కడప పాలనాధికారి బిషప్ గాలిబాలి, నల్గొండకు చెందిన గోవిందు జోజి తదితర పీఠాధిపతులు రానున్నారు. ఈ నెల 24న జెండా ప్రతిష్టతో తిరునాళ్ల ఉత్సవాలు ఆరంభమయ్యాయి. 21 సంవత్సరాల తరువాత ఎడ్ల పోటీలు ఇక్కడ నిర్వహిస్తున్నారు. ఎక్కడ చూసినా తిరునాళ్ల వాతావరణమే కన్పిస్తుంది.

కార్పొరేటర్లు.. క్యాంపులు

(5వ పేజీ తరువాయి)

కామిరెడ్డి రంగారెడ్డి, ఉడుముల లక్ష్మి, బోడపాటి ఉషారాణిలు వెళ్లలేదు. కూటమి తరపున టీడీపీ, జనసేన కార్పొరేటర్లు మొత్తం 29 మంది హైదరాబాద్ క్యాంపులో ఉన్నారు.

మేయర్ సీటుకు చెక్కేనా?

మేయర్ మనోహర్‌నాయుడుకు మార్చి నెల 17తో నాలుగేళ్ల పూర్తి అవుతుంది. ఈ క్రమంలో ఈ నెల 3న జరిగే స్టాండింగ్ కమిటీ ఎన్నికలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. నాలుగేళ్ల పదవి కాలం పూర్తి అయిన వెంటనే మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు కూటమి నేతల సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో స్టాండింగ్ కమిటీ ఎన్నికలను కూటమి, వైసీపీ నేతలు సెమీఫైనల్లా భావిస్తున్నారు. ఏ పార్టీ తరపున స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎక్కువ మంది గెలుపొందితే, ఆ పార్టీ కార్పొరేషన్‌లో పటిష్ఠంగా ఉన్నట్లు భావిస్తారు. ఇదే సమయంలో వైసీపీ కార్పొరేటర్లు టీడీపీ, జనసేనలో చేరుతుండటంతో వైసీపీ నేతలు అప్రమత్తమయ్యారు.



హైదరాబాద్ శిబిరంలో వైసీపీ కార్పొరేటర్

3న జరిగే ఎన్నికలో మొత్తం 56 మంది కార్పొరేటర్లు ఆరుగురు సభ్యులను ఎన్నుకోవాలి. అంటే ప్రతీ కార్పొరేటర్ ఆరేసి ఓట్లు వేయాలి. బరిలో ఉన్న 12 మంది పోటీదారుల పేర్లు మాత్రమే బ్యాలెట్‌పై ఉంటాయి. వారి పేరు ఎదురుగా 'ఎక్స్' గుర్తుతో ఓటు వేయాలి. ఎక్కువమంది కార్పొరేటర్లు ఎవరికైతే ఓట్లు వేస్తారో వారిని స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా గెలుపొందినట్లు అధికారుల ప్రకటిస్తారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నకరికల్లు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మాచర్లకు చెందిన షేక్ జిలానీ(30) స్కూటర్‌పై మాచర్ల వైపు వెళ్తుండగా నకరికల్లు మండలం దేచవరం అడ్డరోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొనటంతో జిలానీకి తీవ్ర రక్త స్రావం అయింది. నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు జిలానీ మృతి చెందినట్టు తెలిపారు.

వైసీపీ హయాంలోనే... ఎన్జీరంగా వర్సిటీలో అక్రమాలు

- రాజకీయ ఒత్తిడితో జరిగిన బదిలీలు రద్దు
- డబ్బులిచ్చి పదవిలో ఉండాల్సిన అవసరం లేదు
- 'ఆంధ్రజ్యోతి'తో వీసీ డాక్టర్ శారదా జయలక్ష్మి



గుంటూరు సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు రైస్ బౌల్ (ఆహారపు గిన్నె) అని పేరు రావటంలో ఆచార్య ఎన్జీ రంగా యూనివర్సిటీది కీలక పాత్ర!. ఈనాటికీ రాష్ట్రంతో పాటు, దేశంలోని అనేక రాష్ట్రాలు కడుపునిండా అన్నం తింటున్నాయంటే దానికి వెనుక వర్సిటీ శాస్త్రజ్ఞుల శ్రమ, కృషి ఎంతో ఉందని చెప్పడంలో అతిశయోక్తిలేదు. ఆరు దశాబ్దాల పరిశోధన యాత్రలో హరితవిప్లవానికి బాటలు వేసిన యూనివర్సిటీ రాశి, వాసి గురించి ఎంత చెప్పినా తక్కువే! అటువంటి యూనివర్సిటీ గత వైసీపీ ప్రభుత్వ పాలనలో రాజకీయాలకు వేదికైంది. ప్రభుత్వం మారిన తర్వాత వీసీ విష్ణువర్ధన్ రెడ్డి, ప్రస్తుత వీసీ శారదా జయలక్ష్మిపై పలు ఫిర్యాదులు, ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత వీసీ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మీ 'ఆంధ్రజ్యోతి' తో ప్రత్యేకంగా మాట్లాడారు. గడచిన ఐదేళ్ల కాలంలో అక్కడ జరిగిన అనేక విషయాలను వివరించారు.

● సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతుల్లో జరిగిన అక్రమాలు?

వీసీ: 2021 లో జరిగిన సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతుల్లో 2016లో సవరించిన ఉత్తర్వులు పాటించలేదు. అప్పుడు కూడా 2006నాటి నిబంధనలే పాటించటం వల్ల కొందరికి ప్రమోషన్లు దక్కలేదు. అప్పుడు విష్ణువర్ధన్ రెడ్డి వీసీ గా ఉన్నారు. నేను వీసీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత 2022లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి డిపార్ట్మెంటల్ కమిటీ, స్క్రీనింగ్ కమిటీని ఏర్పాటు చేసి పారదర్శకంగానే ప్రమోషన్లు ఇచ్చాం. జీఓ 20 ప్రకారం జరిగిన ప్రమోషన్లలో అక్రమాలకు తావులేదు.

● బదిలీల వ్యవహారంలో అవినీతి జరిగిందన్న ఆరోపణలు?

వీసీ : వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు జరిగిన బదిలీల్లో రాజకీయ ఒత్తిళ్లు ఉన్న మాట నిజమే. నేను రాకముందే అక్రమ బదిలీలు జరిగాయి. దానికి పాత వీసీ ఉన్నప్పుడే బీజం పడింది. అప్పుడే తిరుపతి వ్యవసాయ కళాశాలలో ఎక్కువ మందిని నియమించారు. ఇక్కడ(లాం) ఉన్న చాలామంది అర్హులైన సైంటిస్టులను అకారణంగా చాలా దూరానికి బదిలీ చేశారు. వాళ్లకు అక్కడ మూడేళ్ల సర్వీసు పూర్తయిన తర్వాత కూడా ఇక్కడికి రాకుండా అడ్డుకున్నారు. ఇవన్నీ గతంలో జరిగినవే. నేను వీసీగా బాధ్యతలు తీసుకున్నాక ఆ తప్పిదాలను, అక్రమాలను సరిచేసే బాధ్యతను తీసుకున్నాను. అర్హులైన వారు ఎవరైతే ఉన్నారో వాళ్లను తిరిగి లాంకు తెచ్చాను. కేంద్రం జీతాలు చెల్లించే కళాశాలలో అవసరమైన సిబ్బందిని నియమించాను.

● మీ పైన కూడా వైసీపీ నేతలు ఒత్తిడి తెచ్చారా?

వీసీ: బదిలీల విషయంలో మా మీద ఎంత ఒత్తిడి తీసుకువస్తారో చెప్పలేను. ఉదాహరణకు ఒక ఉదంతం చెబుతాను. లాం మెయిన్ ఆఫీసులో ఉన్న ఒక ఉద్యోగిని లాంలోనే ఉన్న మరో చోటికి బదిలీ చేశాను. వైసీపీకి చెందిన ఒక ముఖ్య నేత ఉదయాన్నే ఫోన్ చేసి ఆ ఉద్యోగిని ఉన్న చోటే ఉంచమని ఒత్తిడి తెచ్చారు. దాని కోసం ఒక మంత్రి.. ఇంకా చాలామంది ఫోన్ చేశారు. చాలా సందర్భాల్లో రాజకీయ నేతలు చెప్పిన బదిలీలు చేయక తప్పని పరిస్థితి.

● 2024 ఎన్నికలకు ముందు జరిగిన అక్రమ బదిలీలపై చర్యలు ఏమిటి?

వీసీ: అప్పట్లో రాజకీయ ఒత్తిడితో జరిగిన ప్రతి బదిలీనీ రద్దు చేయాలని నిర్ణయించాం. డిప్యూటేషన్‌పై ఉండే అదనపు సిబ్బందిని వారి ఒరిజినల్ ప్రదేశానికి పంపిస్తాం. ఎవరు ఎక్కడ జీతం తీసుకుంటున్నారో అక్కడికే వెళ్లిపోయేలా చర్యలు చేపడతాం.

● ప్రస్తుతం ఉన్న పదవిలో కొనసాగే విషయం?

వీసీ: ఎవరెవరో ఏదేదో మాట్లాడుతున్నారు. అన్ని అర్హతలూ ఉన్నాయి కాబట్టే నన్ను ఈ పదవికి ఎంపిక చేశారు. అప్పట్లో సీనియారిటీ లిస్టు పంపేటప్పుడు కేవలం విష్ణువర్ధన్ రెడ్డి ఒక్కరి పేరు మాత్రమే పంపారు. ఆ లిస్టు చూసి అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మొత్తం పది మంది పేర్లతో సీనియారిటీ జాబితా పంపమని చెప్పారు. ఆ జాబితా ప్రకారం నాకు అవకాశం వచ్చింది. అది ఎన్ని రోజులుంటే అన్ని రోజులు కొనసాగుతాను. డబ్బులిచ్చి ఈ పదవిలో కొనసాగాల్సిన అవసరం లేదు.

● నిధుల దుర్వినియోగంపై ఏమంటారు?

వీసీ: యూనివర్సిటీకి సంబంధించిన నిధుల ఖర్చు, కేటాయింపుల వ్యవహారంలో వీసీ పాత్ర ఏమీ ఉండదు. సంబంధిత విభాగాధిపతులు అన్ని ఫైళ్లూ పరిశీలించి నాదగ్గరకు పంపుతారు. వాటిని చూసి ఆమోద ముద్ర వేయటమే నా పని. ఎక్కడా నగదు వ్యవహారం ఉండదు. అంతా ఆన్‌లైన్ చెల్లింపులే. మెయిన్ బిల్డింగ్ నిర్మాణం అంతా ప్రభుత్వం, ఏపీఐఐసీకి మధ్యే జరుగుతుంది. అందులో వర్సిటీ ప్రమేయం, పాత్ర ఏమీ ఉండదు.

ముందు వెళ్తున్న లారీని ఢీకొన్న లారీ

- ఒకరు మృతి



మృతి చెందిన గణేష్

రొంపిచర్ల, జనవరి 31 (ఆంధ్రజోతి): మండలంలోని మర్రిచెట్టుపాలెం వద్ద ముందు వెళ్తున్న లారీని వెనుకగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్‌లోని ఉప్పల్ చిలకానగర్‌కు చెందిన పొన్నం గణేష్(33) ఐషర్ వాహనంలో హైదరాబాద్ నుంచి ప్రకాశం జిల్లాలోని చేపల చెరువుకు కోళ్లకు చెందిన వ్యర్థాలను తీసుకు వెళ్తున్నాడు. మర్రిచెట్టుపాలెంలోని కాలనీ వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గణేష్ మృతి చెందాడు. వాహనం ముందు భాగం బాగా దెబ్బతింది. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ మణికృష్ణ సందర్శించారు. మృతదేహాన్ని నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతని బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతునికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 552.30 అడుగులు ఉంది. ఇది 214.87 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 2684 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7436, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,165 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2200, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 41,765 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	119,127,137
చికెన్ విత్ స్కిన్	226.00
చికెన్ స్కిన్ లెస్	236.00

70,952 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 61,331 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 70,952 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 58,781 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	14500	334	8500	13000
నెంబరు. 5	9000	13000	నెంబరు.5	--	--
273	7500	14000	273	--	--
341	8000	15000	341	10000	11000
4884	9000	12500	4884	--	--
సూపర్ 10	8000	13500	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7000	14500	తేజ	7500	14000
బ్యాడిగి	8000	13000	బ్యాడిగి	9500	12000
దేవనూరు డీలక్స్	8000	13000	దేవనూరు డీలక్స్	10000	11500
తెల్లకాయలు	4000	10000	తెల్లకాయలు	4500	8500

వెయ్యి మంది దాటిన పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ

● అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల కోసం గుంటూరు తూర్పు (94), పశ్చిమ నియోజకవర్గంలో (95) వెయ్యి మంది దాటిన ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేస్తూ ప్రకటించిన డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్లపై రాజకీయ పార్టీల ప్రతినిధుల అభిప్రాయాలు, సూచనలు పరిగణలోకి తీసుకుంటామని పశ్చిమ నియోజకవర్గం ఏఈఆర్‌ఓ, జీఎంసీ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. జీఎంసీ ప్రధాన కార్యాలయంలోని అదనపు కమిషనర్ చాంబర్‌లో శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. అదనపు కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో వెయ్యి మందికి మించిన ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను, అదే ప్రాంతంలో మరొక కేంద్రం ఏర్పాటుకు డ్రాఫ్ట్ తయారు చేశామన్నారు. సమావేశంలో పాల్గొన్న ఆయా పార్టీల ప్రతినిధులు డ్రాఫ్ట్‌పై ఏ విధమైన అభ్యంతరాలు తెలపలేదన్నారు. సమావేశంలో ఏఈఆర్‌వోలు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, సూరజ్ కుమార్, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ పద్మనాభరావు, డిప్యూటీ తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, నాయుడు ఓంకార్ (టీడీపీ), పాండురంగ విఠల్ (బీజేపీ), సీహెచ్ వాసు (బీఎస్పీ), బి.సునీల్ కుమార్ (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్) కె.నళినికాంత్ సీపీఐ(ఎం), టి.సేవా కుమార్ (అమ్ ఆద్మీ పార్టీ), సీహెచ్ రామ వెంకట త్రినాథ్(జనసేన) పాల్గొన్నారు.

నేడు, రేపు జేకేసీ న్యాయ కళాశాలలో మ్యూట్ కోర్టు పోటీలు

గుంటూరు (విద్య) జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని జాగర్లమూడి చంద్రమౌళి న్యాయ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 1, 2 తేదీలలో 4వ జాతీయ స్థాయి మ్యూట్ కోర్టు పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినేని సుధాకర్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం జరిగే ప్రారంభ కార్యక్రమానికి విశాఖపట్నంలోని దామోదర సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. దేశంలోని 35 విద్యాసంస్థలకు చెందిన న్యాయ విద్యార్థులు పోటీల్లో పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు.

3 నుంచి కాశీ ఖండంపై ప్రవచనం

గుంటూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రణవ పీఠాధిపతి బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్‌తో సంపూర్ణ స్కాంద పురాణంలోని కాశీ ఖండంపై ప్రవచన కార్యక్రమం ఈనెల 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు సంపత్‌నగర్‌లోని శ్రీ శారదాపరమేశ్వరి దేవస్థానంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడు రోజుల పాటు ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 8 గంట ల వరకు ప్రవచన కార్యక్రమం జరుగుతుందన్నారు.

ముగిసిన శ్రీమద్రామాయణ ప్రవచనాలు

గుంటూరు(తూర్పు), జనవరి 31(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై ముప్పవరపు కేశవరావు శత జయంతిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న శ్రీ మద్రామాయణ ప్రవచనాల కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. భారతి ధార్మిక విజ్ఞాన పరిషత్ బొల్లేపల్లి సత్యనారాయణ, ఆలయ పాలక మండలి అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ మస్తానయ్య, లంకా విజయబాబు, పుట్టగుంట ప్రభాకరరావు, ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం పాలకవర్గ సభ్యులు ముప్పవరపు వేంకట సింహాచలశాస్త్రిని ఘనంగా సత్కరించారు.

ఏపీఏఈఎస్ఈ నూతన కార్యవర్గం ఎన్నిక

గుంటూరు(తూర్పు), జనవరి 31(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీ ఎన్జీవో హోంలో శుక్రవారం ఏపీ అగ్రికల్చరల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ (ఏపీఏఈఎస్ఈ) జిల్లా కార్యవర్గ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా ఆ సంఘ రాష్ట్ర సభ్యులు డీఎస్ఎన్ శ్రీనివాసరావు వి.రమేష్, పాపారావు వ్యవహరించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడిగా ఎం.శ్రీనివాసరావు, కార్యదర్శిగా కె.రామ్మోహన్, కోశాధికారిగా షేక్ అజిముల్లా, ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఏపీఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, ఏపీఏ ఈఎస్ఈ రాష్ట్ర అధ్యక్షుడు సాయికుమార్, రవి కుమార్, శ్యాం సుందర్ శ్రీనివాస్, శివ జ్యోతి ముఖ్య అతిధులుగా హాజరై నూతన కమిటీని అభినందించారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

గుంటూరు(తూర్పు), జనవరి 31(ఆంధ్రజ్యోతి): స్థానిక గోరంట్ల, అన్నపూర్ణ నగర్‌లోని శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అనంతరం స్వామి వారిని పెండ్లి కుమారుడిగా అలంకరించి పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

ఆలయ కమిటీ అధ్యక్షుడు యర్రం శెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా శనివారం ధ్వజారోహణ, 2న వార్షిక కల్యాణం, గ్రామోత్సవం, 3న పూర్ణాహుతి, అన్నదానం, 4న స్వామి వారి పవళింపు సేవ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, తాళ్ల శ్రీనివాసరావు, ఎర్రంశెట్టి సురేష్, సాయి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బంగారు గొలుసు అపహరణ

గుంటూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్తంభాలగరువు మూడో లైన్ వద్ద రేగళ్ల సుజాత మెడలో బంగారు గొలుసును ద్విచక్ర వాహనంపై వచ్చిన యువకుడు తెంచుకెళ్లాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో ఎన్నికల నియమావళి అమలు

● రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, హోర్డింగుల తొలగింపు

● విగ్రహాలకు ముసుగులు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణ, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికకు సంబంధించి జనవరి 29వ తేదీ నుండే ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చినందున జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ పరిధిలో ఎన్నికల నియమావళిని పటిష్ఠంగా అమలు చేస్తున్నామని, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సహకరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వార్డు సచివాలయాల వారీగా వివిధ రాజకీయ పార్టీల బ్యానర్లు, పోస్టర్లు, హోర్డింగ్‌లను పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలోని దళం బృందాలు తొలగిస్తున్నాయన్నారు. అలాగే రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలను ముసుగులతో కప్పివేయడం జరుగుతుందన్నారు.

నూతన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయకూడదని అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. సచివాలయ కార్యదర్శులు తమ సచివాలయం పరిధిలో నూరు శాతం ఎన్నికల నియామావళి పక్కాగా అమలు జరిగేలా సంయుక్తంగా కృషి చేయాలని, నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



నగరంలో ఫ్లెక్సీలను తొలగిస్తూ, రాజకీయ నాయకులు విగ్రహాలకు ముసుగు వేస్తున్న మున్సిపల్ సిబ్బంది





కాసు వెంగళరెడ్డి, వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు ముసుగులు

గిరిజన సంక్షేమ శాఖలో పదోన్నతులు కల్పించాలి

గుంటూరు(తూర్పు), జనవరి 31(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖలో దాదాపు 5 ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉండి విధులు నిర్వహిస్తున్న గ్రేడ్-2 అధికారులకు, గ్రేడ్ -1 అధికారులుగా పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి ఆయన వినతి పత్రం అందజేశారు. అనంతరం చాంద్ బాషా మాట్లాడుతూ కరోనా సమయంలో చనిపోయిన ఉపాధ్యాయుల పిల్లలకు వెంటనే కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో సంఘ సభ్యులు రామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, శరత్ కుమార్, కోటా సాహెబ్, మల్లేశ్వరి, రోజా పాల్గొన్నారు.

అభ్యాసనం నిరంతర ప్రక్రియగా ఉండాలి

● ఎన్‌జీ రంగా వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రరావు

గుంటూరు (విద్య) జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అభ్యసనం నిరంతర ప్రక్రియగా ఉండాలని ఎన్జీ రంగా వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు అన్నారు. చౌడవరంలోని శ్రీవెంకటేశ్వర బాలకుటీర్ చేతనలో శుక్రవారం జరిగిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రామచంద్ర మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలతో కలసి గడిపినప్పుడు ఆత్మీయ బంధాలు బలంగా ఉంటాయన్నారు. అప్పుడే విద్యార్థులు సన్మార్గంలో పయనిస్తారని అన్నారు. ఆర్‌వీఆర్‌అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను గుర్తించి వారిని ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో బాలకుటీరు వ్యవస్థాపకురాలు డాక్టర్ నన్నపనేని మంగాదేవి, సిఎవో దుర్గా రఘురామ్, వర్శిటీ విశ్రాంత రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు,చేతన నిర్వహకురాలు మరుద్వతి, సహకార్యదర్శి జయశ్రీ, ప్రిన్సిపల్స్ డాక్టర్ ఎండి నస్రీన్, మల్లికార్జునరావు, వెంకటేశ్వర్లు, డీన్ లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రెడ్ క్రాస్ రాష్ట్ర కోశాధికారిగా రామచంద్రరాజు



రామచంద్రరాజుని అభినందిస్తున్న ఏకే పరిడా తదితరులు

గుంటూరు(తూర్పు), జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏపీ రాష్ట్ర శాఖ కోశాధికారిగా నగరానికి చెందిన పి.రామచంద్రరాజు ఎన్నికైయ్యారు. విజయవాడలో నిర్వహించిన రెడ్‌క్రాస్ రాష్ట్ర సమావేశంలో కార్యవర్గ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆయనను రాష్ట్ర కోశాధికారిగా ఎన్నుకున్నారు. ప్రస్తుతం నగరంలోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరం టీఎంటీ ట్రస్ట్‌కు కార్యదర్శిగా, భారతీయ విద్యాభవన్స్‌కు ప్రధాన కార్యదర్శిగా సేవలు అందిస్తున్నారు. రాష్ట్ర గవర్నర్, రెడ్ క్రాస్ రాష్ట్ర శాఖ గౌరవాధ్యక్షులైన అబ్దుల్ నజీర్ సమక్షంలో త్వరలో ప్రమాణస్వీకారం చేస్తున్న పి రామచంద్ర రాజుకు పలువురు అభినందింనలు తెలిపారు.

ఫార్మసీ విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాలి

● ఏపీటీఐ అధ్యక్షుడు వెంకటరమణ

గుంటూరు (విద్య) జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఫార్మసీ విద్యార్థులను పరిశోధన వైపు మళ్లించడంతోపాటు వారిలో నైపుణ్యాలు పెంపొందించేలా అధ్యాపకులు కృషి చేయాలని అసోసియేషన్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టీచర్స్ ఆఫ్ ఇండియా(ఏపీటీఐ) అధ్యక్షుడు కే.వెంకటరమణ విజ్ఞప్తి చేశారు. చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మానూటికల్ సైన్సెస్‌లో రెండు రోజులుగా జరుగుతున్న ఫార్మా నెక్స్ జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకటరమణ, ఏపీటీఐ ఉపాధ్యక్షుడు వై.అంకమ్మ చౌదరి మాట్లాడుతూ విద్యార్థుల్లో నూతన ఔషధాలు రూపొందించే నైపుణ్యాలు పెంపొందించాలని సూచించారు. సదస్సులో చిప్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర, కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, డాక్టర్ సిఎన్ శ్రీనివాస్, ఏపీటీఐ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.ప్రసాదరావు, కార్యదర్శి డి.నరేంద్ర తదితరులు పాల్గొన్నారు .ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు.

వైభవంగా శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ వేడుకలు

గుంటూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఏటుకూరు రోడ్డులోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారి ఆత్మార్పణ వేడుకలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు జరిగే వేడుకల్లో తొలి రోజు అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి ఉత్సవ నిర్వాహకులు పట్టువస్త్రాలను సమర్పించారు. అమ్మవారికి పంచామృతాభిషేకాలు, చండీ హోమాలు నిర్వహించారు. శనివారం సామూహిక లక్ష కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఏసీ గ్రంధి మాధవి, ఆలయ కమిటీ సభ్యుడు నిడమానూరు సురేష్, కొనకళ్ళ సత్యం, టీఎల్‌వీ వీరాంజనేయులు, అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుడివాడ రవికుమార్ పలువురు నిర్వాహకులున్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ మృతి

● మానసిక స్థితి సరిగా లేకపోవడమే కారణం

గుంటూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : నిప్పంటించుకొని ఆత్మహత్యాయత్నం చేసిన బృందావన్ గార్డెన్స్ నాలుగో లైన్‌కి చెందిన నిమ్మగడ్డ లావణ్య (67) మృతి చెందింది. పట్టాభిపురం పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గార్డెన్స్‌కు చెందిన నిమ్మగడ్డ హరిచంద్రయ్య, లావణ్య దంపతులకు ఇరువురు కుమారులు సంతానం. ఒకరు కెనడాలో, మరొకరు అమెరికాలో ఉంటున్నారు. హరిచంద్రయ్య గుంటూరు మెడికల్ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. ఇరువురు కుమారులు విదేశాల్లో ఉంటుండడంతో తల్లి లావణ్య మానసికంగా ఆందోళన చెందుతోంది. దీంతో ఆమె మానసిక వైద్యుని వద్ద చికిత్స తీసుకుంటుంది. జనవరి 29న వేకువజామున లావణ్య నిద్రలేచి అగ్గిపెట్టితో నిప్పంటించుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. భర్త ఆమెను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు నిమ్మగడ్డ శ్రీధర్ ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోయంబత్తూర్‌లో మెరుగైన తాగునీటి సరఫరా

● జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు



కోయంబత్తూర్‌లో తాగునీటి సరఫరా విధానాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ లో అనుసరిస్తున్న సాంకేతిక పద్ధతుల ద్వారా ప్రజలకు మెరుగైన తాగునీటి సరఫరా జరుగుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. కోయంబత్తూర్‌లో జరుగుతున్న రీజినల్ వర్క్‌షాప్, క్షేత్ర స్థాయి పరిశీలనలో కమిషనర్ శుక్రవారం పాల్గొన్నారు. కమిషనర్ మాట్లాడుతూ కోయంబత్తూర్ కార్పొరేషన్‌లో శుక్రవారం జరిగిన వర్క్‌షాప్‌లో అమృత్ 2.0 డైరెక్టర్ ఇషా కాలియా ట్యాప్ నుంచి తాగునీటిని తీసుకోవడంపై, అమృత్ అడిషనల్ సెక్రటరి డి.తారా ప్రజలకు తాగునీటి సరఫరాపై అవగాహన కల్గించే విధానం వివరించారన్నారు. పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ డిప్యూటీ అడ్వయిజర్ డాక్టర్ రమాకాంత్ ట్యాప్ నుంచి తాగునీటి సరఫరా అంశం గైడ్‌లెన్స్‌ని, కర్ణాటకలో 24/7 తాగునీటి సరఫరాపై డాక్టర్ కేపీ జయరాం వివరించగా, కోయంబత్తూర్‌లో దశలవారీగా తాగునీటి సరఫరాలో చేపట్టిన చర్యలను కమిషనర్ శివగురు ప్రభాకరన్ తెలిపారన్నారు. అనంతరం కోయంబత్తూరులోని ఏకెఎస్ నగర్ లో తాగునీటి పైప్‌లైన్‌పై లీకులను వినూత్నమైన విధానంలో వేగంగా గుర్తించడం, చరణ్ నగర్‌లో ఆటోమేటిక్‌గా తాగునీటి సరఫరా, సెంట్రల్ కమాండ్ కంట్రోల్ సెంటర్, కస్టమర్ రిలేషన్ మేనేజ్‌మెంట్ సెల్‌లను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

నాడు ఫీజు బకాయిలు పెట్టి నేడు నాటకం : మన్నవ

గుంటూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : తాము అధికారంలో ఉన్నప్పుడు విద్యార్థులకు ఫీజు రీయింబర్సుమెంటు చేయకుండా బకాయిలు పెట్టిన వైసీపీ నేడు ఫీజు పోరు పేరుతో నాటకమాడుతోందని తెలుగు విద్యార్థి జిల్లా అధ్యక్షుడు మన్నవ వంశీకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు ఫీజు రీయింబర్స్‌మెంట్ అడిగినందుకు తనపై రేప్ కేసు బనాయించిందన్నారు. విద్యా దీవెన - వసతి దీవెన అంటూ ప్రచారం చేసుకుంటూ విద్యార్థులకు ఫీజులు చెల్లించకుండా ఇబ్బందులపాలు చేశారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంటు రూ.2,832 కోట్లు, వసతి దీవెన బకాయిలు రూ.989 కోట్లు, పీజీ ఫీజ్ రీయింబర్స్‌మెంట్ రూ.450 కోట్లు బకాయిల కుప్ప పెట్టిన జగన్ ఇప్పుడు ఫీజు పోరనడం నయవంచనే అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు విద్యార్థి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపాటి అమృత రావు, రాష్ట్ర కార్యదర్శి ధర్మతేజ, దంతా ప్రశాంత్, ఉప్పుటూరి వెంకట్, వేద తదితరులు పాల్గొన్నారు.

ఏడు లక్షలమంది పేద విద్యార్థులను మోసగించిన జగన్

● తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు దియ్యా రామకృష్ణ ప్రసాద్

గుంటూరు సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ఏడు లక్షల మంది పేద విద్యార్థులను మోసగించిన ఘనత జగన్‌కు మాత్రమే దక్కుతుందని తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు దియ్యా రామకృష్ణ ప్రసాద్ విమర్శించారు. ఆయన శుక్రవారం గుంటూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2019-2024 మధ్య కాలంలో జగన్ ప్రభుత్వం పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రూపేణా చెల్లించాల్సిన రూ.4,271 కోట్లను ఎగ్గొట్టిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పాత బకాయిల కింద రూ.788 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం విడుదల చేసిందన్నారు. చివరకు ఎన్నికల ముందు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం నిధులు విడుదల చేస్తున్నట్లు జగన్ దొంగ బటన్‌లు నొక్కారన్నారు. ప్రజలను బిచ్చగాళ్లుగా మాట్లాడిన జోగి రమేష్‌ను సభ్య సమాజం నుంచి వెలివేయాలని దియ్యా రామకృష్ణ పిలుపునిచ్చారు.

అతి వేగంగా వాహనాలు నడపటం ప్రమాదకరం

● ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాధిపతి రాధిక రాణి వెల్లడి

గుంటూరు మెడికల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): యువత ద్విచక్ర మోటారు వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, అతి వేగంగా వాహనాలు నడపటం ప్రమాదకరమని గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ రాధిక రాణి తెలిపారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం ప్రభుత్వ సమగ్రాస్పత్రి అత్యవసర వైద్య విభాగం క్యాజువాల్టీ దగ్గర రోడ్డు ప్రమాదాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పాటించాల్సిన నిబంధనలను తెలియజేస్తూ ముద్రించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. డాక్టర్ రాధిక రాణి మాట్లాడుతూ మోటారు వాహనదారులు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు మల్లీశ్వరి, గోపాల్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమని, చట్టరీత్యా నేరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు (విద్య) జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరే కించాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఎస్ఎఫ్ఐ 49వ జిల్లా మహాసభల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్న మార్పులను ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని, నూతన జాతీయ విద్యా విధానం ప్రవేశ పెట్టడం వల్ల జాతీయ స్థాయిలో విద్యా ప్రమాణాలు పడిపోయాయని తెలిపారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ గవర్నమెంట్ విద్యను కాపాడుకోవాల్సిన బాధ్యత మన మీద ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎస్కే సమీర్, జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్, జిల్లా ఉపాధ్యక్షురాలు కే నవిత, సహహి, కార్యదర్శి ఏ.యశ్వంత్, పవన్, సుభాష్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఏసీ కళాశాలలో రిసెప్షన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఏసీ కళాశాలలో స్ట్రాంగ్‌రూం పరిశీలన

● ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి: కలెక్టర్

గుంటూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణ - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గానికి ఫిబ్రవరి 27న జరిగే ఎన్నికలకు సంబంధించి స్థానిక ఏసీ కళాశాలలో బ్యాలెట్ బాక్సులు భద్రపర్చే గదులు, రిసెప్షన్ సెంటర్లు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి ఎస్ నాగలక్ష్మి పరిశీలించారు. శుక్రవారం సాయంత్రం ఆమె సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ తేజతో కలసి ఏసీ కళాశాలని సందర్శించారు. పోలింగ్ కేంద్రాల నుంచి ఏసీ కళాశాలకు వచ్చే వాహనాలు, తిరిగి వెళ్ళే వాహనాలతో ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా తీసుకోవలసిన చర్యలపై అధికారులతో చర్చించారు. రిసెప్షన్ కౌంటర్ల వద్ద బ్యాలెట్ బాక్సుల స్వీకారం, వాటిని సంబంధిత గదులకు తరలించే మార్గాల్లో బ్యారికేడింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని, సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గుంటూ రు రెవెన్యూ డివిజన్ అధికారి షేక్ ఖాజావలి, ఆర్డీఓ కె శ్రీనివాస రావు, జీయంసీ అదనపు కమిషనర్ ఓబులేశు, తూర్పు మండల తహసీల్దార్ నగేష్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని ఆకళింపు చేసుకోవాలి

ఎలక్షన్ కమిషన్ ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణపై రూపొందించిన నిబంధనావళి పుస్తకాన్ని క్షుణ్ణంగా ఆకళింపు చేసుకుని నోడల్ అధికారులు ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి సూచించారు. శుక్రవారం కలక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో ఉమ్మడి కృష్ణ-గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గానికి ఎన్నికలకు సంబంధించి ఆమె నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ మేనేజిమెంట్ల నోడల్ అధికారులు ఎన్నికల నియమావళిని క్షుణ్ణంగా చదివి ఆ మేరకు ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు నోడల్ అధికారుల నియామకం

కృష్ణా-గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు నోడల్ అధికారులను నియమిస్తూ కలెక్టర్ నాగలక్ష్మి శుక్రవారం ఉత్తర్వు లు జారీ చేశారు. సీపీవో, డీఐవో(మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్), డీటీసీ(రవాణ నిర్వహణ), డీఆర్‌వో(ట్రైనింగ్ మేనేజ్‌మెంట్), జడ్పీ సీఈవో(మేటీరియల్, బ్యాలెట్ బాక్సుల నిర్వహణ), సీపీవో(సీఈవో, ఈసీఐకి నిత్యం నివేదికలు పంపడం), డ్వామా పీడీ(ఎంసీసీ రిపోర్టులు, ఎన్నికల ఫిర్యాదులు, వ్యయ పరిశీలన), హౌసింగ్ పీడీ(అబ్జర్వర్స్‌కు నోడల్ అధికారి), అదనపు ఎస్పీ(శాంతిభద్రతలు, వీఎం, జిల్లా సెక్యూరిటీ ప్లాన్), డీఆర్‌డీఏ పీడీ(బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్, పోస్టల్ బ్యాలెట్ పేపర్, డమ్మీ బ్యాలెట్ పేపర్), ఐ అండ్ పీఆర్ డీడీ(మీడియా, కమ్యూనికేషన్స్), డీఐవో(ఐటీ అప్లికేషన్స్), డీఈవో, స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(స్వీప్), సీపీవో(హెల్ప్‌లైన్ ఫిర్యాదులు), గుంటూరు ఆర్‌డీవో, తెనాలి సబ్ కలెక్టర్, సర్వే ఏడీ(కమ్యూనికేషన్ ప్లాన్, పోలింగ్ స్టేషన్లు, కౌంటింగ్ సెంటర్), డీఎస్‌వో(పోలింగ్ సిబ్బంది సంక్షే మం), డీపీవో(పోస్టల్ బ్యాలెట్ మేనేజ్‌మెంట్), కేఆర్‌ఆర్‌సీ ఎస్‌డీసీ(ఎలక్టోరల్ రోల్స్, మార్క్‌డ్ కాపీల సన్నద్ధత), జీఎంసీ కమిషన్, గుంటూరు ఆర్‌డీవో(డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్ల ఏర్పాటు, కౌంటింగ్ కేంద్రాల ప్రతిపాదన).



అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు, దేవకుమార్ తదితరులు

దళిత సాధికారతతోనే సమాజాభివృద్ధి

● ఎమ్మెల్యే ఆనందబాబు

గుంటూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): దళిత సాధికారతతోనే సమాజాభి వృద్ధి సాధ్యమవుతుందని మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు తెలిపారు. దళిత బహుజన రీసోర్స్ సెంటర్ (డీబీఆర్‌సీ) ఆధ్వర్యంలో గోరంట్లలోని డి స్క్వేర్ కన్వెన్షన్ హాల్లో క్షేత్రస్థాయి మహిళా సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో మహిళలందరికి సమాన హక్కులు సాధించేందుకు హిందూ కోడ్ బిల్లు ద్వారా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పునాదులు వేశారన్నారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ మహిళలు వెనుకబడి ఉన్నామన్న భయం వదిలేసి ధైర్యంగా ముందుకెళ్ళటం ద్వారానే సాధికారత సాధించవచ్చన్నారు. డీబీఆర్‌సీ డైరక్టర్ అల్లడి దేవకుమార్ మాట్లాడుతూ అణగారిన వర్గాల్లో ప్రత్యేకించి మహిళల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు డీబీఆర్‌సీ గత ఐదేళ్ళుగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం శరత్‌బాబు, నాగార్జున యూనివర్శిటీ ప్రొఫెసర్ శాంతిశ్రీ, ప్రముఖ సైకాలజిస్టు ప్రొఫెసర్ ఎన్.అరవింద్, డీబీఆర్‌సీ డిప్యూటీ డైరక్టర్ ప్రోగ్రాం మేనేజర్ చుక్కా శామ్యూల్ అనీల్‌కుమార్, దళిత ఆదివాసీ బడ్జెట్‌వాచ్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బి.రమణమూర్తి, మల్లెల చిన్నప్ప, హేమలత, జానూ రమాదేవి, దార్ల కోటేశ్వరరావు తదితరులున్నారు.

నామిని పత్రాలు లేక నష్టపోతున్న పెన్షన్‌దారుల వారసులు

గుంటూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెన్షన్ పొందుతున్న కుటుంబ పెన్షన్‌దారులు తాము జీవించి ఉన్న సమయంలో నామిని పత్రాలను అందజేయలేకపోవటంతో వారి వారసులు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రయోజనం పొందలేకపోతున్నారని రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య తెలిపారు. సర్వీసులో ఉంటూ మరణించిన ఉద్యోగి భార్య లేదా భర్త కుటుంబ పెన్షన్‌దారులు అవుతారన్నారు. ఇలాంటి వారు రాష్ట్రంలో లక్ష మంది వరకు ఉంటారన్నారు. వాస్తవానికి వీరిలో అత్యధికులకు ఉద్యోగ సంఘాలు, పెన్షనర్ల సంఘాలతో సంబంధాలు ఉండవన్నారు. పైగా పెన్షన్ విషయాలకు సంబంధించిన పరిజ్ఞానం కూడా తక్కువగా ఉంటుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగి ఆకస్మికంగా చనిపోయినప్పుడు ఆ ఇంటి ఇల్లాలికి మరణించిన ఉద్యోగి పని చేసే కార్యాలయం సిబ్బంది సహకారంతో పెన్షన్ వస్తుందన్నారు. ఆ తరువాత పిల్లల చదువులు, వారి జీవనోపాధి కోసం ఎక్కడెక్కడో కాలం వెళ్ళదీస్తుంటారన్నారు. ఇలాంటి వారిలో అత్యధికులు తమ నామిని పత్రాలను ఉప ఖజానా కార్యాలయాల్లో అందజేయకపోవటం వల్ల కుటుంబ పెన్షన్‌దారు మరణిస్తే కుటుంబ సభ్యులు ఎవరికీ ప్రయోజనాలు లభించటం లేదన్నారు. నిబంధనల ప్రకారం నామిని పత్రం ఇచ్చి ఉంటే పెళ్ళి కాని 25 ఏళ్ళ లోపు పిల్లల్లో ఒకరికి పెన్షన్, ఇతరత్రా ప్రయోజనాలు లభిస్తాయన్నారు. ఒక వేళ ఇవన్నీ తెలుసుకొని ఎవరైనా ప్రయత్నిస్తే లీగల్ హెయిర్ సర్టిఫికెట్ కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. అదే నామిని పత్రాలు ముందుగా సమర్పించి ఉంటే ఎటువంటి లీగల్ హెయిర్ సర్టిఫికెట్ లేకుండా జీవితకాల బకాయిలు, మట్టి ఖర్చులు పొందటంతో పాటు విధవరాలైన కుమార్తె, పెళ్ళి కాని కుమార్తె, విడాకులిచ్చిన కుమార్తె, మానసిక వికలాంగులైన కుమారుడు లేక కుమార్తె జీవితకాలం పెన్షన్స్ పొందే అవకాశం ఉందని వీరయ్య తెలిపారు.

జగన్ మళ్లీ అధికారంలోకి రాడు..

● ఆయన అడిగింది ఒక్క ఛాన్సే ● కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్


మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

గుంటూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ పాలన అవినీతిమయం కావటంతో అధికారం కోల్పోయింది.. జగన్‌మళ్లీ అధికారంలోకి రాడు ఆయన ప్రజల్ని అడిగింది ఒక్క ఛాన్సే అని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ వ్యాఖ్యానించారు. గుంటూరులో శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ, మాల, మదిగల మధ్య చిచ్చుపెట్టేందుకు ఎస్సీ వర్గీకరణ అంశం తెరపైకి తెచ్చారని విమర్శించారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. వర్గీకరణ కేవలం రిజర్వేషన్‌లకే కాదు అన్నింట్లో ఉండాలన్నారు. సుప్రీంకోర్టు జడ్జీల పోస్టుల్లో వర్గీకరణ కావాలి. లక్షల కోట్లు బ్యాంకుల అప్పుల్లో వర్గీకరణ కావాలి, కాంట్రాక్టుల్లో వర్గీకరణ కావాలన్నారు. సుప్రీంకోర్టు జడ్జీలు 33మంది ఉంటే, అందులో ఒకే సామాజికవర్గం (బ్రాహ్మణులు) 20మంది ఉన్నారని పేర్కొన్నారు. అమరావతి కోర్టులో ఎంతమంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ జడ్జీలున్నారో చెప్పాలని ప్రశ్నించారు. బ్యాంకులను జాతీయం చేసింది కాంగ్రెస్ పార్టీ, ప్రధాని ఇందిరాగాంధీ. కానీ నేడు ఎస్సీలకు, ఎస్టీలకు, ఓబీసీలకు బ్యాంకులు ఇస్తున్న అప్పులు 1 శాతం మాత్రమేనని, మిగిలిన 99శాతం బ్యాంకు అప్పులు ఎవరికిస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. ఒకాయనకు రూ.45వేల కోట్లు అప్పులిచ్చాయి. కానీ ఆ వ్యక్తికి మోడీ సాయం చేసి, రూ.40వేల కోట్ల అప్పులు మాఫీ చేయించాడు. పవర్ ప్రాజెక్టు పేరుతో మళ్లీ ఇంకో రూ.10వేల కోట్లు అప్పు కావాలని అడుగుతున్నాడని మండిపడ్డారు. రాష్ట్రంలో వర్గీకరణ జోలికిపోతే సీఎం చంద్రబాబుకే నష్టమన్నారు. వర్గీకరణ కోసం సీఎం చంద్రబాబు వేసిన మిశ్రా కమిషన్‌ను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. సీఆర్‌డీఏ కాంట్రాక్ట్ పనుల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల్లో ఎంతమందికిచ్చారు? ఇక్కడ వర్గీకరణ కావాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో వచ్చే 2029 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో ఓబీసీని ముఖ్యమంత్రిగా చూడాలన్నదే నా కోరికని తెలిపారు. కేవలం అమరావతి రాజధానిలో వేల కోట్లు ఖర్చుపెట్టటం సరికాదని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల అభివృద్ధికి వెచ్చించాలన్నారు. జెమిలి ఎన్నికలతో చంద్రబాబుకే నష్టమని స్పష్టం చేశారు.

అట్టహాసంగా విజ్ఞాన్ బాల మహోత్సవ్

● చిన్నారులకు రాష్ట్రస్థాయిలో ఆటల పోటీలు


క్రీడాజ్యోతిని తీసుకువస్తున్న విద్యార్థులు

గుంటూరు(విద్య), జనవరి 31(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎల్లప్పుడు ఉల్లాసంగా, ఉత్సాహంగా, ఆరోగ్యంగా ఉండాలని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో చిన్నారుల కోసం మొట్టమొదటి సారిగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బాల మహోత్సవ్ కార్యక్రమాన్ని శుక్రవారం అట్టహాసంగా ప్రారంభించారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన విద్యార్థులు ముందుగా "విజ్ఞాన్ బాల మహోత్సవ్ 2కే25"లో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ చిన్నారులు మొబైల్ ఫోన్‌ను సాధ్యమైనంత తక్కువగా వినియోగించాలన్నారు. అదేవిధంగా జంక్‌ఫుడ్ తినకుండా సంప్రదాయ వంటలను మాత్రమే తీసుకోవాలన్నారు. విద్యార్థులు ప్రతిరోజు గ్రౌండ్‌లో ఆటలు ఆడుకోవాలన్నారు. ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటూ చదువులో బాగా ఫోకస్ చేయాలన్నారు. విద్యార్థులు ఫిజికల్‌గా ఫిట్‌గా ఉన్నట్లైతే మెంటల్‌గా స్ట్రాంగ్‌గా ఉంటారని తెలిపారు. జీవితంలో కష్టపడి పనిచేయడంతో పాటు బాగా కృషి చేసిన వారే ఉన్నత స్థానాలను అధిరోహిస్తారని వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ నాగభూషణ్ అన్నారు. విద్యార్థులు కలల సాకారానికి అంకితభావంతో కృషి చేస్తే ఉన్నతంగా ఎదిగే శక్తి సామర్థ్యాలు మీలో ఉన్నాయన్నారు. క్రీడలు శారీరక ఉల్లాసానికే కాకుండా మానసిక ఉల్లాసానికి కూడా దోహదపడతాయన్నారు. ముందుగా స్పోర్ట్స్ మీట్‌లో బాలురకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, 100 మీటర్లు, 800 మీటర్లు, 100 మీటర్ల రిలే నిర్వహిస్తామన్నారు. బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, 100 మీటర్లు, 800 మీటర్లు, 100 మీటర్ల రిలే పోటీలు నిర్వహించారు. వీటితో పాటు మ్యూజిక్ (క్లాసికల్ సింగింగ్ సోలో, సింగింగ్ ఐడల్ లిటిల్ చాంప్, గ్రూప్ సింగింగ్, ఇన్‌స్ట్రుమెంట్ సోలో), డాన్స్(క్లాసికల్, వెస్ట్రన్, ఫోక్ (గ్రూప్), లిటరరీ (వ్యాసరచన, లెటర్ రైటింగ్, జనరల్ క్విజ్, ఎలక్యూషన్), ఫైన్ ఆర్ట్స్ (స్పాట్ పెయింటింగ్, క్లే మోడలింగ్) పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.


సెల్ఫీ పాయింట్ వద్ద విద్యార్థుల జోరు


వేడుకలకు భారీగా హాజరైన విద్యార్థినీ విద్యార్థులు


సంగీత పోటీల్లో నువ్వా నేనా అంటూ...


ఖోఖో పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

మహానాడుకు లోకేశ్ రక్ష

● రూ 294 కోట్ల వ్యయంతో కృష్ణానదికి రిటైనింగ్ వాల్
● మహానాడు వాసులకు తప్పనున్న కృష్ణా వరద ముంపు



సీతానగరం వద్ద కృష్ణాతీరం వద్ద వారధి నుంచి ప్రకాశం బ్యారేజి వైపు రిటైనింగ్‌వాల్ నిర్మించనున్న ప్రదేశమిదే

మంగళగిరి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మహానాడు ఏరియా వాసులకు స్థానిక ఎమ్మెల్యే నారా లోకేశ్ అభయహస్తాన్ని అందించారు. తరచుగా వచ్చే కృష్ణానది వరద ముంపునకు గురై నానా అగచాట్లు పడుతూవస్తున్న మహానాడు ప్రాంత ప్రజలను... ఇక ఆ సమస్య నుంచి లోకేశ్ ఒడ్డెక్కిస్తున్నారు. కొన్ని దశాబ్దాలుగా వున్న కృష్ణా వరద ముంపు సమస్యను ఎమ్మెల్యే లోకేశ్ శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించేందుకు చొరవ చూపి నిధుల మంజూరుకు కృషి చేశారు. కొద్ది రోజుల కిందట జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు అయ్యే రూ 294 కోట్ల నిధులను లోకేశ్ మంజూరు చేయించారు. దీంతో మహానాడు వాసుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

మంగళగిరి నియోజకవర్గంలో ప్రజలను దీర్ఘకాలంగా వేధిస్తున్న పెను సమస్యల పరిష్కారంపై లోకేశ్ దృష్టి పెట్టారు. ఇక ఈ సమస్యలు ఎప్పటికీ పరిష్కారం కావేమోనన్న నిరాశల మధ్య నలిగిపోతున్న ప్రజలకు అదృష్టం లోకేశ్ రూపంలో వచ్చి పడింది. ఆయన ఎమ్మెల్యేగా బాధ్యతలు తీసుకోవడానికి ముందే మంగళగిరి నియోజకవర్గ సమస్యలపై సంపూర్ణమైన అవగాహనను ఏర్పరచుకున్నారు. అందుకే అధికారంలోకి వచ్చిందే తడవుగా ప్రధానమైన పెను సమస్యలపైనే దృష్టిని కేంద్రీకరించారు. మొన్నటికి మొన్న స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటుకు మంత్రివర్గంచే ఆమోదముద్ర వేయించిన లోకేశ్ మలి సమావేశంలో రూ 53 కోట్ల వ్యయంతో మంగళగిరిలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇప్పించారు. తాజాగా జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఏకంగా రూ 294 కోట్ల వ్యయంతో సీతానగరం మహానాడు ఏరియాను కృష్ణా వరదముంపు నుంచి తప్పించేందుకు రక్షణగోడను నిర్మించేందుకు తీర్మానం ఆమోదింపజేశారు. ఓ రకంగా చెప్పాలంటే రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగినప్పుడల్లా మంగళగిరి నియోజకవర్గానికి ఏదొక వరం ప్రాప్తించేలా లోకేశ్ కృషి చేస్తున్నారు.

మహానాడు... తెలుగుదేశంపార్టీకి చాలా ముఖ్యమైన కార్యక్రమం. పార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు జన్మదినం మే 28వ తేదీని పురస్కరించుకుని ప్రతియేటా మే 27 నుంచి 29 వరకు తెలుగుదేశం పార్టీ రాష్ట్రస్థాయిలో జరుపుకునే ఓ పెద్ద వేడుక. తొలి మహానాడుకు 1983లో విజయవాడ వేదిక కాగా రెండో మహానాడుకు తాడేపల్లి లోని కృష్ణానదీ తీర ప్రాంతమైన సీతానగరం కేంద్రమైంది. నాడు మహానాడు జరుపుకున్న ఆ కృష్ణాతీర ప్రాంత మైదానాన్ని ఆనక పేదల నివాసాల నిమిత్తం ప్రభుత్వం పేదలకు పంచి పెట్టడంతో ఆ ప్రాంతం మహానాడు ఏరియాగా ముద్ర వేసుకుంది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో సుందరయ్యనగర్, మహానాడు కాలనీల పేరుతో వేలాది జనావాసాలు నిండిపోయాయి. అయితే కృష్ణానదికి అయిదు లక్షల క్యూసెక్కులకు మించి వరద వచ్చినప్పుడల్లా మహానాడు ప్రాంతం వరదముంపునకు గురవుతూ వస్తుంది. ఈ సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలంటే ప్రకాశం బ్యారేజి దిగువన బ్యారేజి నుంచి కనకదుర్గమ్మవారధి వరకు సుమారు రెండు కిలోమీటర్ల పొడవునా కాంక్రీట్ రిటైనింగ్‌వాల్ (రక్షణగోడ)ను నిర్మించాలి. వాస్తవానికి కృష్ణా వరదలకు అటు విజయవాడవైపు కృష్ణలంక కూడా ముంపునకు గురౌతుంది. ఆ సమస్యను పరిష్కరించేందుకు గతంలో విజయవాడ వైపు కూడా కృష్ణాతీరం వెంబడి రిటైనింగ్ వాల్ నిర్మాణం చేశారు. ఇపుడు ఇటు గుంటూరు జిల్లా వైపు మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి సీతానగరం కృష్ణాతీరంలో కూడా రిటైనింగ్‌వాల్‌ను నిర్మిస్తే మహానాడు వాసులకు వరద ముంపు సమస్య తప్పుతుంది.

వాస్తవానికి మహానాడు వాసులు ఏనాడు అనుకోని...ఊహించని వరాన్ని లోకేశ్ వారికి ప్రసాదించినట్టే. ముంపు సమస్య పరిష్కారం కావాలంటే రూ వందల కోట్లు కావాల్సిందే. ప్రభుత్వం నుంచి అన్నేసి వందల కోట్లను సాధించి తీసుకొచ్చే వారెవరుంటారులెమ్మని... అక్కడి బాధితులు ఇన్నాళ్లూ మౌనంగానే వుండిపోయారు. ఓ రకంగా చెప్పాలంటే... ఏ బాధితుడూ... ఏ రాజకీయపార్టీ కూడా మహానాడు వాసుల ప్రయోజనార్థం కృష్ణాతీరంలో రిటైనింగ్‌వాల్‌ను నిర్మించాలని గొంతెత్తి అడుగలేదు. అయినా.. లోకేశ్ వచ్చాడు.. సమస్యను గమనించాడు...దానికి శాశ్వత పరిష్కారమార్గం వైపు నడుం కట్టాడు. త్వరలోనే సీతానగరం ఏరియాలో రైల్వే బ్రిడ్జి ప్రాంతం 0.9 నుంచి కనకదుర్గమ్మ వారధి 2.9 కి.మీల వరకు అంటే రెండు కిలోమీటర్ల పొడవునా కాంక్రీట్ రిటైనింగ్ వాల్ నిర్మాణం జరుగనుంది. ఈ రక్షణగోడ నిర్మాణంతో వరదల సందర్భంలో కూడా మహానాడు వాసులు ఏ ఆందోళన లేకుండా ప్రశాంతంగా జీవించే రోజులు రాబోతున్నాయి.


మహానాడు ఏరియా


వరదల సందర్భంలో నది నుంచి మహానాడు నివాసాలను ముంచెత్తిన వరదనీరు (ఫైల్‌ఫోటో)

ముగ్గురు మృతి.. ముగ్గురికి గాయాలు

● ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాల ఢీ
● స్నేహితుడి పుట్టిన రోజు కేక్ కోసం వస్తుండగా ఘటన
● గుంటూరు సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం


బలరామ్, డేవిడ్‌రాజు, గోవర్ధన్ మృతదేహాలు

గుంటూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గుంటూరుకు సమీపంలోని ఏటుకూరు గ్రామ శివారులో శుక్రవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ముగ్గురు ఘటనా స్థలంలో మృతి చెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. వట్టిచెరుకూరు మండలం కుర్నూతల గ్రామానికి చెందిన జూటూరి డేవిడ్ రాజు అలియాస్ దావీదు (18), ఎం గోవర్ధన్(18), నల్లచెరువు బొమ్మల సెంటర్‌కు చెందిన ఎన్ బలరాం(38) అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు, మృతుల బంధువుల కథనం మేరకు.. కుర్నూతల గ్రామానికి చెందిన డేవిడ్ రాజు, గోవర్ధన్, మనీష్ అనే ముగ్గురు ఒకే ద్విచక్రవాహనంపై కేక్ కొనుగోలుకు గుంటూరు వస్తున్నారు. డేవిడ్ రాజు క్లాస్మేట్ అయిన కొర్నెపాడు గ్రామానికి చెందిన యువకుడి పుట్టిన రోజు కావడంతో కేక్ కొనుగోలుకు గుంటూరు వస్తున్నారు. అదే సమయంలో పర్చూరు వెళ్లే రోడ్డులో రాఘవేంద్ర కాటన్ మిల్‌లో పని చేసే మేస్త్రి ఎన్ బలరాం ద్వి చక్రవాహనంపై మిల్లుకు వెళ్తున్నాడు. ఈయన వద్ద కూలీ పనులు చేసుకునే ఐదో మైలుకు చెందిన రంగమ్మ(45), ఆమె కుమారుడు మల్లికార్జున్(19) గుంటూరు నుంచి ఇంటికి వెళుతుండగా మార్గమధ్యలో బలరాం కనిపించడంతో ఆయన ద్విచక్ర వాహనం ఎక్కారు. ఏటుకూరుకు, ఐదో మైలుకు మధ్యన రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా బలంగా ఢీకున్నాయి. ఈ ప్రమాదంలో డేవిడ్ రాజు, గోవర్ధన్, బలరాంలు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. మనీష్ తలకు గాయం కావడంతో మతిస్థిమితం కోల్పోయినట్లుగా ఉన్నాడు. రంగమ్మకు గాయాలుకాగా ఆమె కుమారుడు మల్లికార్జున్ పరిస్థితి కొంత ఆందోళనకరంగా ఉంది. గాయపడిన ముగ్గురిని జీజీహెచ్‌కు తరలించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన నల్లపాడు సీఐ వంశీధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడు కుటుంబాల్లో తీవ్ర విషాదం

అతివేగం.. అజాగ్రత్తతో సంభవించిన ప్రమాదంతో మూడు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. డేవిడ్ రాజు ఏసీ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. గోవర్ధన్ కప్ బోర్డు వర్క్ చేస్తుంటాడు. గాయపడిన మనీష్ ఇంటర్ చదువుతున్నాడు. వారు హెల్మెట్ పెట్టుకోక పోవడంతోనే ప్రాణాలు కోల్పోయారని పోలీసులు వెల్లడించారు.


ఘటనా స్థలిని పరిశీలిస్తున్న నల్లపాడు సీఐ వంశీధర్

..వరాలిచ్చేనా?

(5వ పేజీ తరువాయి)

వస్తుందని అంచనా వేశారు.

● గుంతకల్లు - గుంటూరు డబ్లింగ్‌కు గత ఏడాది రూ.480 కోట్లు కేటాయించింది. అయితే దిగువమెట్ట వద్ద రిజర్వు ఫారెస్టులో ఇంకా కొన్ని అనుమతులు రావాల్సి ఉండటంతో పనులు జరగడం లేదు. ఈ కారణంగా అదొక బాటిల్ నెక్‌గా మారింది.

● గుంటూరు-బీబీనగర్(248 కిలోమీటర్ల) రైల్వే డబ్లింగ్‌కి గత ఏడాది రూ.220కోట్ల మూలధనం మంజూరుకావడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది ఇంకా ఎక్కువ మొత్తంలో నిధుల కేటాయింపు జరగాలని రైల్వేవర్గాలు ఆశిస్తున్నాయి. విష్ణుపురం వద్ద బైపాసు లైన్‌కు కూడా నిధుల కేటాయింపు ఎక్కువమొత్తంలో జరగాలని ఆశిస్తున్నారు.

● గుంటూరులో శంకర్‌విలాస్ ఆర్‌వోబీకి ఇటీవలే రూ.109 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో ఈ ఏడాది బడ్జెట్‌లో ఎంత మొత్తం కేటాయిస్తారోనన్న ఉత్కంఠ నెలకొన్నది. పలకలూరు రైల్వేగేటు, ఇన్నర్‌రింగురోడ్డు రైల్వేగేటు వద్ద కూడా ఆర్‌వోబీలు మంజూరయ్యాయి. వీటికి కూడా నిధుల కేటాయింపు ఎక్కువమొత్తంలో జరగాలని పలువరు కోరుకుంటున్నారు.

● కేంద్ర ప్రభుత్వ నిధులతో పేరేచర్ల - కొండమోడు నాలుగు వరసల జాతీయ రహదారి నిర్మాణం జరుగుతున్నది. దీనికి ఏమేరకు కేటాయింపులు జరుపుతారోనని అంతా ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు.

● అనంతపురం - అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవేకి ఈ బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయిస్తారో, లేదోనన్న అనుమానాలు నెలకొన్నాయి.

● 72 కిలోమీటర్ల మేర తీరప్రాంతం ఉన్న బాపట్ల జిల్లాకు పర్యాటకంగా కేంద్రం ఊతమిస్తే ఉపాధిపరంగా వేలసంఖ్యలో ఉద్యోగాల కల్పన జరుగుతుంది. జిల్లా అభివృద్ధికి ఇందనంగా ఆతిథ్యరంగం మారే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. తొలి అడుగులో సూర్యలంక బీచ్ అభివృద్ధికి రూ.93 కోట్ల కేటాయింపులకు కేంద్రం ఇటీవల పచ్చజెండా ఊ పిన సంగతి తెలిసిందే. ఆ నిధులకు సంబంధించి బడ్జెట్‌లో కేటాయింపులపై ఉత్కంఠ నెలకొంది.

● నిజాంపట్నం మండలం దిండి తీర ప్రాంతంలో సమీకృత ఆక్వాపార్కు నిర్మాణానికి అదనంగా ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని జిల్లావాసులు ఎదురుచూస్తున్నారు.

● బాపట్ల జిల్లాలో 22,000 ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతుంది. ఇక్కడ నుంచి పెద్ద ఎత్తున రొయ్యలు, చేపలు విదేశాలకు ఎగుమతి అవుతాయి. కేంద్రం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో ఆక్వా రంగానికి రాయతీల వరాల జల్లు కురిపించడంపై రైతాంగం ఆశతో ఉంది. ఆక్వాపార్కు ప్రాజెక్టు నిర్మాణం వ్యయం పెంచడానికి గతంలోనే కేంద్రం ఆమోద తెలిపింది. రూ.90కోట్ల నుంచి రూ.190కోట్ల వరకు పెంచే ప్రతిపాదనలకు అనుమతిచ్చింది. దీనికి సంబంధించి బడ్జెట్‌లో నిధులు కేటాయింపుపై కూడా జిల్లావాసులు ఆశలు పెట్టుకున్నారు.


సూర్యలంక సముద్రతీరం (ఫైల్‌ఫోటో)

కుల, మతాల మధ్య చిచ్చు పెడుతున్న మోదీ ప్రభుత్వం

● సీ పీ ఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

గుంటూరు(తూర్పు), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మతాలు, కులాలు, ప్రాంతాల మధ్య చిచ్చుపెడుతూ మోదీ ప్రభుత్వం పాలన సాగిస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మండిపడ్డారు. స్థానిక కొత్తపేట లోని, మల్లయ్య లింగం భవన్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో అన్ని వ్యవస్థలను కేంద్ర ప్రభుత్వం ఛిద్రం చేస్తున్నా ప్రశ్నించలేని పరిస్థితుల్లో రాష్ట్రంలో పాలక, ప్రతిపక్ష నాయకులు ఉన్నారని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాల అమలుకు కార్యాచరణ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 5న నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ జరిగే నిరసనల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. సమావేశంలో మేడా హనుమంతరావు, ఆకిటి అరుణ్ కుమార్, కాబోతు ఈశ్వరరావు, బందెల నాసర్ జీ, జంగాల చైతన్య తదితరులు పాల్గొన్నారు.

మిర్చి ఎగుమతులు పెరిగేలా చూడండి

● ప్రభుత్వపరంగా ఏమి సహకారం కావాలన్నా ఇస్తాం
● రైతుకు గిట్టుబాటు ధర లభించడమే అందరి లక్ష్యం కావాలి
● మిర్చి ట్రేడర్ల సమావేశంలో మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత

గుంటూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయంగా మిర్చి ఎగుమతులు పెరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర డైరెక్టర్ విజయ సునీత మిర్చి ట్రేడర్లను కోరారు. ఎగుమతుల పరంగా ప్రభుత్వం నుంచి ఏమైనా సాయం కావాలన్నా చేస్తామన్నారు. గతంలో ఎలాగైతే రైతులకు మంచి గిట్టుబాటు ధర లభించిందో అలానే ధర వచ్చేలా అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం గుంటూరులోని మార్కెటింగ్ కమిషనరేట్‌లో డైరెక్టర్ విజయసునీత మిర్చి ట్రేడర్లతో సమావేశం నిర్వహించి ప్రభుత్వ ఆలోచనని తెలియజేశారు. గత వారంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్ సహాయ శాఖ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు ప్రస్తుత మిర్చి సీజన్లో రైతులకు గిట్టుబాటు ధర లభించేటట్లు చూడాలని, మిర్చి రైతుల సమస్యలను పరిష్కరించాలని సీఎం నారా చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. దీనిపై సీఎం స్పందించి రెండు రోజుల క్రితం మార్కెటింగ్, వ్యవసాయం, ఉద్యానవాన శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి మిర్చి రైతులకు గిట్టుబాటు ధర లభించేటట్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆమేరకు శుక్రవారం మార్కెటింగ్ డైరెక్టర్ మిర్చి ఎగుమతి, దిగుమతి వ్యాపారస్తులు, అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మిర్చి మార్కెట్‌పై సమీక్ష చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1.94 లక్షల హెక్టరులలో మిర్చి పంట సాగు చేయగా 11.29 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని అంచన వేయడం జరిగిందన్నారు. గుంటూరు మిర్చియార్డుకు మన రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణ నుంచి రైతులు తమ సరుకులను తీసుకొచ్చే అవకాశం ఉన్నందున మిర్చి రైతులకు గిట్టుబాటు ధర లభించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిర్చి ఎగుమతి వ్యాపారస్తులు వెలగపూడి సాంబశివరావు, తోట రామ కృష్ణ, పొత్తూరి నరేంద్ర, కొత్తూరి సుధాకర్, కర్లపూడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్లో రైతులకు లభిస్తున్న ధరలు రాబోయే రోజుల్లోనూ నిలకడగా ఉంటాయన్నారు. గతంతో పోల్చితే చైనా, బంగ్లాదేశ్, నేపాల్ తదితర దేశాలకు ఎగుమతులు ఆశాజనకంగా లేవన్నారు. ప్రస్తుతం శీతల గిడ్డంగులలో ఉన్న మిర్చి నిల్వలు ఎగుమతికి అనుకూలంగా లేనందున మార్కెట్లో ధరలు ఆశించిన స్థాయిలో పెరుగుదల లేదన్నారు, అయినప్పటికీ ఫిబ్రవరి 15 తరువాత పంట దిగుబడులు, మిర్చి ఎగుమతులపై ఒక అంచనా వస్తుందని అప్పటి వరకు ప్రస్తుత మిర్చి ధరలు నిలకడగా ఉంటాయని చెప్పారు. శీతల గిడ్డంగులలో 80 లక్షల బస్తాలు నిల్వ సామర్థ్యం ఉన్న దృష్ట్యా ధర తగ్గినా రైతులు వాటిల్లో నిల్వ చేసుకొని బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొంటారని చెప్పారు. సమావేశంలో చివరిలో మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత మాట్లాడుతూ రైతులకు మార్కెట్లో మిర్చి పంటకు గిట్టుబాటు ధర అందించేందుకు సహకరించవలసినదిగా కోరారు. మిర్చి సీజన్ ప్రారంభమైనందున అధిక సంఖ్యలో మిర్చి బస్తాలు వస్తున్నందున రైతులు, వ్యాపారస్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలన్నారు. యార్డులో ట్రాఫిక్ నియంత్రణకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిబ్రవరి, 15 తరువాత తదుపరి సమావేశం ఏర్పాటు చేసి మిర్చి దిగుబడులు, ధరలను సమీక్షించి తదుపరి కార్యాచరణ చేపడతామని చెప్పారు.


గుంటూరులోని మార్కెటింగ్ కమిషనరేట్‌లో మిర్చి ట్రేడర్లతో సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్ అండ్ డైరెక్టర్ విజయ సునీత

1044 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, జనవరి 31: స్థానిక పసుపు మార్కెట్‌యార్డులో శుక్రవారం జరిగిన వేలంలో 1044 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ. 9,200, గరిష్ఠ ధర రూ. 9,700, మోడల్ ధర రూ.9,700పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ. 9,700, గరిష్ఠ ధర రూ. 10,300 మోడల్ ధర రూ.9,700 పలికాయి.

పశ్చిమ డెల్టా కాల్వకు 2010 క్యూసెక్కులు విడుదల

దుగ్గిరాల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 2010 క్యూసెక్కుల సాగునీటిని శుక్రవారం విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 106 క్యూసెక్కులు రేపల్లె కాల్వకు 130, తూర్పు కాల్వకు 242, పశ్చిమకాల్వకు 120, నిజాంపట్నం కాల్వకు 50, కొమ్మమూరుకాల్వకు 930 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

నేడు కృష్ణానదిలో 7.20లక్షల చేపపిల్లల విడుదల

తాడేపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానదిలో శనివారం జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో మీనోత్సవం నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా 7.20 లక్షల చేపపిల్లలు సీడ్ స్టాకింగ్ కమిటి సభ్యుల సమక్షంలో విడుదల చేయనున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మత్స్యకారుల ప్రగతి కోసం ప్రయోజనం కోసం వారి జీవనోపాధులు మెరుగు పరచడానికి ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన మిషన్ ఫింగర్‌లింక్స్ పథకం 2024-25 ద్వారా మత్స్యశాఖ ఉచితంగా రాష్ట్రంలో గల రిజర్వాయర్లు అన్నింటిలోనూ పెద్ద ఎత్తున చేపపిల్లలను వదిలే కార్యక్రమం చేపడుతున్నారు. ఇందులో భాగంగా కృష్ణానదిలో శనివారం సాయంత్రం 4 గంటలకు ఉండవల్లి పడవల రేవు వద్ద ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారని, మత్స్యకారులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని మత్స్యశాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలి

కాకుమాను, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పనిసరిగా పాటించాలని తహసీల్దార్ వెంకట స్వామి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఎన్నికల ప్రవర్తన నియమావళిని అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. ప్రశాంత ఎన్నికలకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టే ప్రయత్నాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాంగోపాల్, అగస్టీన్‌బాబు, బోడపాటి ప్రసాద్, అబ్దుల్ నబీ, బీజేపీ నాయకులు శ్రీధర్, నక్కా రాంగోపాల్, జనసేన నాయకులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం

కాకుమాను, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అప్పాపురం శివారులోని అభయాంజనేయస్వామి 3వ వార్షికోత్సవం శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కాటూరి అంకినీడు పాల్గొన్నారు.



పశువైద్యకేంద్రంలో జరిగిన శిబిరంలో పాల్గొన్న ఏడీవో డాక్టర్ అపర్ణ, పశువైద్యుడు సురేష్, సిబ్బంది

పశువైద్య శిబిరానికి విశేష స్పందన

దుగ్గిరాల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా పశువైద్యశాలలో ఉచిత పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని ఏడీఏ ఆర్. అపర్ణ అన్నారు. మండల కేంద్రం దుగ్గిరాల ఏరియా పశువైద్య కేంద్రంలో ఉచిత పశువైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ పాడిరైతుల గేదెలు, కోళ్లు, కుక్కలు తదితర 752 కేసులకు అవసరమైన వైద్య సేవలు అందించామని తెలిపారు. పెదపాలెం పశువైద్యుడు డాక్టర్ సురేష్ మాట్లాడుతూ 30 మంది పాడిరైతులు వారి గేదెలకు వైద్యం చేయించుకున్నారన్నారు. గేదెలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులతో పాటు వందలాది కోళ్లు, కుక్కలకు టీకాలు వేసినట్లు తెలిపారు. గేదెలకు అవసరమైన మందులను పాడిరైతులకు అందజేశారు.

ఏపీఏఈఎస్ఈ నూతన కార్యవర్గం ఎన్నిక

గుంటూరు(తూర్పు), జనవరి 31(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీ ఎన్జీవో హోంలో శుక్రవారం ఏపీ అగ్రికల్చరల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ (ఏపీఏఈఎస్ఈ) జిల్లా కార్యవర్గ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా ఆ సంఘ రాష్ట్ర సభ్యులు డీఎస్ఎన్ శ్రీనివాసరావు వి.రమేష్, పాపారావు వ్యవహరించారు. ఈసందర్భంగాసంఘ జిల్లా అధ్యక్షుడిగా ఎం.శ్రీనివాసరావు, కార్యదర్శిగా కె.రామ్మోహన్, కోశాధికారిగా షేక్ అజిముల్లా, ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఏపీఎన్జీవో అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివా సరావు, ఏపీఏఈఎస్ఈ రాష్ట్ర అధ్యక్షుడు సాయికుమార్, రవి కుమార్, శ్యాం సుందర్ శ్రీనివాస్, శివ జ్యోతి ముఖ్య అతిథులుగా హాజయ్యారు.

అంచుదిగితే.. అంతే సంగతి !

- దశాబ్దాలు గడుస్తున్నా విస్తరణకు నోచుకోని ప్రధాన రహదారి
- తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

దుగ్గిరాల, జనవరి 31: పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా రోడ్డు విస్తరణ చేపట్టక పోవడంతో తెనాలి-విజయవాడ ప్రధాన రహదారిలో తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వాహనాలు ఎదురెదురుగా వస్తున్నప్పుడో, ఏదేనీ ఒక వాహనానికి సైడ్ ఇస్తున్నప్పుడో రోడ్డు మార్జిన్‌కి దిగితే.. ఇక అంతే సంగతి.. అన్నరీతిలో ప్రదాన రహదారి ఉంది. దీంతో వాహనదారులు ఆ మార్గంలో నిత్యం భయాందోళనల మధ్య ప్రయాణం కొనసాగిస్తున్నారు. వాహనదారులు తమగోడు పట్టించుకోవడం లేదని మొర పెట్టుకుంటున్నప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. కొంతమేర తారురోడ్డు వేసి, మిగిలిన రోడ్డుకు తాత్కాలికంగా మరమ్మతులు చేపడుతున్నారు. కాగా రేవేంద్రపాడు నుంచి దుగ్గిరాల వరకూ బకింగ్‌హామ్ కాల్వ అంచున వాహన ప్రయాణం ఇరుకైన రోడ్డుతో అత్యంత ప్రమాదకరంగా మారింది. కొత్తగా వేసే రోడ్డు విస్తరణతో ప్రారంభమవుతుందని బావించినప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. దుగ్గిరాల పాత లాకు నుంచి కొత్తలాకు వరకూ రోడ్డు మరింత ఇరుకుగా ఉండటంతో ఎదురుగా భారీవాహనాలు వస్తే తప్పుకునేందుకు కూడా వీలులేని పరిస్థితి. వంతెనల మూలమలుపు వద్ద ఇరువైపులా 30అండుగుల మేర ఎత్తుగా వున్నప్పటికీ కనీసం రక్షణ గోడగానీ, రెయిలింగ్ కానీ లేకపోవడంతో అదుపుతప్పి తరచూ కాల్వ వైపునకు వాహనాలు దూసుకెళ్లి ప్రమాదాలు పరిపాటై పోయాయి. ఉన్నరోడ్డును కొత్తగా నిర్మించినప్పటికీ వేగనియంత్రణలు వేయడంగానీ, రోడ్డుకు ఇరువైపులా సైడ్‌బెరమ్స్ వేయడంకానీ చేయలేదు. తెనాలి-విజయవాడ మెయిన్‌రోడ్డులో నిత్య రెండు వేలకుపైగా వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఇటీవలి కాలంలో కురుస్తున్న మంచుకారణంగా ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా నిర్లక్ష్యాన్ని వీడి వాహనాదారుల ఇక్కట్లపై ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించాలని, ప్రమాదాల నివారణకుగానూ సైడ్ బెరమ్స్, వేగనియంత్రణలైనా ఏర్పాటు చేసేందుకుగానూ తగుచర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



దెబ్బతిన్న దుగ్గిరాల పాతలాకు వంతెన,



ప్రమాదకరంగా రోడ్డు మార్జిన్



ట్రాఫిక్ సమస్యతో భారీగా నిలిచిన వాహనాలు

కార్మికులు భద్రతతో వ్యవహరించాలి

- జిల్లా కర్మాగారాల చీఫ్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్



సదస్సులో మాట్లాడుతున్న శివశంకర్

దుగ్గిరాల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కర్మాగారాల్లో ఎత్తైన చోట పనిచేసే కార్మికులు భద్రతతో వ్యవహరించాలని జిల్లాకర్మాగారాల చీఫ్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ అన్నారు. దుగ్గిరాలలోని ప్రపంచ ప్రఖ్యాత కాంటినెంటల్ ఫ్యాక్టరీలో ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు, శిక్షణ కార్యక్రమం ఫ్యాక్టరీ ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. శివశంకర్ మాట్లాడుతూ ఎత్తైన ప్రదేశాల్లో పని చేసే సమయంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై జిల్లాలో తొలిసారిగా శిక్షణ కొనసాగుతుందన్నారు. వీడియోల ద్వారా ప్రమాదాల నివారణ చర్యలు తెలుసుకోవడంకంటే పనిచేసే ప్రదేశాల్లో నేరుగా ప్రదర్శన ద్వారా పూర్తిస్థాయి అవగాహన కలుగుతుందన్నారు. సాధారణంగా ధరించే హెల్మెట్, బూట్లు, గ్లౌజులతో పాటు అదనంగా సేఫ్టీ బెల్ట్, కఫ్‌ఫోల్డింగ్ ద్వారా ఎత్తైన ప్రదేశాలకు చేరుకోవడం తేలికవుతుందన్నారు. 1.8 మీటర్లకు మించి ఎత్తైన ప్రదేశాల్లో పనిచేసే ప్రతిఒక్కరూ విధి నిర్వహణకు వెళ్లే ముందే అన్నిరకాల భద్రతా ఉపకరణాలను వెంట పెట్టుకుని వెళ్లాలన్నారు. విజయవాడ కారమ్ సంస్థ మేనేజర్ ఓబుల్‌రెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది అయూబ్ స్వయంగా ప్రమాదాల నివారణపై ఫ్యాక్టరీ ఉద్యోగుల సమక్షంలో ప్రదర్శన జరిపారు. ఫ్యాక్టరీ మేనేజర్ సీహెచ్ వెంకటశాస్త్రి మాట్లాడుతూ ఫ్యాక్టరీ ఉద్యోగులందరూ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్ఎం ఆనందరావు, హెఆర్ సోమశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ డి. శ్రీనివాసరావు, పలువురు ఫ్యాక్టరీ ఉద్యోగులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం షాపులో రూ.2 లక్షల చోరీ

మంగళగిరి సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం కాజ గ్రామం పరిధిలోని ఓ వైన్‌షాపులో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత దుండగులు వైన్ షాపులోనికి ప్రవేశించి కౌంటర్‌లోని రూ.2 లక్షల నగదును అపహరించారు. చోరీ జరిగిందని గుర్తించిన వైన్ షాపు యజమానులు పోలీసులకు సమాచారం అందించారు. మంగళగిరి రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు, ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సీసీ కెమేరాలను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మంగళగిరి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం చినకాకాని ఎన్నారై జంక్షన్‌లో గుర్తు తెలియని వాహనం ఢీకొని శుక్రవారం రాత్రి ఓ వ్యక్తి మృతిచెందాడు. రోడ్డు దాటుతుండగా గుర్తుతెలి యని వాహనం ఢీకొట్టి వుండవచ్చునని భావిస్తు న్నారు. ప్రమాదంలో తల ఛిద్రం కావంతో సదరు వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. వైజంక్షన్‌లో విద్యు ద్దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



నీటి పరీక్షల కిట్‌లను అందజేస్తున్న సురేష్

నీటి నాణ్యత పరీక్షల కిట్‌ల పంపిణీ

ప్రత్తిపాడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వాటర్ ఎయిడ్ ఆధ్వర్యంలో అన్ని గ్రామాలకు నీటి నాణ్యత పరీక్షల కిట్‌లను జిల్లా కో ఆర్డినేటర్ సురేష్ అందజేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్ని గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, వీవోఏలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి నీటి పరీక్షల విధానంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య సంస్థ సూచించిన ప్రకారం నీరు సురక్షితంగా ఉండాలన్నారు. అందుకు నీటిని పరీక్షించే విధానంపై ప్రతి ఒక్కరికీ అవగాహన రావాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం లాజరు, సంస్థ ప్రతినిధులు సునిల్, సత్యవాణి, సాయి, గ్రామ కార్యదర్శులు, వీవోఏలు, పాల్గొన్నారు.



రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగు వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

నేతల విగ్రహాలకు ముసుగులు

- ఎన్నికల కోడ్ అమలుతో మునిసిపల్ అధికారుల చర్యలు

తాడేపల్లి టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 3వ తేదీన గ్రాడ్యుయేట్ ఎన్నికల నోటిఫి కేషన్ విడుదల కానున్న నేపథ్యంలో ఇప్పటికే ఎన్నికల కోడ్‌ను అధికారులు అమల్లోకి తీసుకొచ్చారు. ఒక టీచర్, రెండు గ్రాడ్యుయేట్ స్థానాలకు సంబంధించి రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ఆయా ప్రాంతాల్లో అమల్లోకి తెచ్చారు. దీంతో తాడేపల్లిలోని రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలకు స్థూపాలపై నేతల విగ్రహాలకు మున్సిపల్ సిబ్బంది ముసుగులు వేస్తున్నారు. అధికా రులు ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు చేస్తూ పలు చర్యలు తీసుకుంటున్నారు. అదే సందర్భంలో కోడ్ ఉల్లంఘనలకు పాల్పడవద్దని హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తు ప్రజలను, రాజకీయనేతలను చైతన్యవంతు లను చేస్తున్నారు.

పాత పద్ధతిలోనే డిగ్రీ పరీక్షలు నిర్వహించాలి

మంగళగిరి సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ దూరవిద్యవిభాగం ఆధ్వర్యంలో డిగ్రీ పరీక్షలను పాత పద్ధతిలోనే నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి కోరారు. శుక్రవారం మంగళగిరిలోని ఏపీ ఉన్నత విద్యా మండలి కార్యాలయం వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేసి, మండలి కార్యదర్శి రాధాకృష్ణ మూర్తికి వినతిపత్రం అందజేశారు. శివారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్ణయాల వలన విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింద న్నారు. 2021 విద్యా సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా 32 వేల మంది విద్యార్థులు ఎస్వీ యూనివర్సిటీ దూరవిద్య డిగ్రీ పరీక్షలకు ఫీజులు చెల్లించినా గత ప్రభుత్వం పరీక్షలు నిర్వహించలేదని చెప్పారు. గత నాలుగేళ్లుగా విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని, ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామని చెప్పిన వర్సిటీ యాజమాన్యం ఇప్పటికి రెండుమార్లు వాయిదా వేసిందని తెలి పారు. 2021 సంవత్సరంలో డిగ్రీ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు పాత పద్ధతిలోనే పరీక్షలు నిర్వహిం చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు జి.వలరాజు, బందెల నాసర్‌జీ, నేతలు సాయికుమార్, యశ్వంత్, అమర్ నాథ్ తదితరులు పాల్గొన్నారు.



మండలి కార్యదర్శి రాధాకృష్ణమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

మంగళగిరి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాలుగో వార్డులోని ఫారెస్టు భూముల్లో ఇళ్ల వేసుకుని నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. సీపీఎం నేత చెంగయ్య మాట్లాడుతూ 40 సంవత్సరాలకు పైనుంచి పేదలు కొండ పోరంబోకులో ఇళ్లు వేసుకుని నివాసం ఉంటున్నారని చెప్పారు. మంత్రి నారా లోకేశ్ ఎన్నికల ముందు ప్రభుత్వ భూములు, కొండ పోరంబోకు భూముల్లో ఇళ్లు వేసుకుని నివసిస్తున్న పేదలకు ఇళ్ల పట్టాలిస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. రాజధానిలో గత ప్రభుత్వం ఇళ్ల స్థలాల పేరుతో సర్టిఫికెట్లు ఇచ్చిందని, వారందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు జె.బ్రాహ్మణి, సాంబయ్య, మహాలక్ష్మి పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కెనాల్స్ ఈఈ మురళీధర్

కాలువ అభివృద్ధి పనుల పరిశీలన

మేడికొండూరు, జనవరి31 (ఆంధ్రజ్యోతి): గుంటూరు బ్రాంచి కాలువలోను, దాని పరిధిలో జరుగుతున్న కాలువల అబివృద్ధి పనులను కెనాల్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎం. మురళీధర్ శుక్రవారం పరిశీలించారు. కాలువలో నాచు, గట్లపై పిచ్చి మొక్కలు తొలగింపు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని, నరకుళ్లపాడు నుంచి గుంటూరు బ్రాంచి కాలువ, బండారు పల్లి మేజరు కాలువ, వంకాలయపాడు మేజరు కాలువ అభివృద్ధి పనులు దాదాపు పూర్తి కానున్నాయని వివరించారు. ప్రస్తుతం మెట్ట పైర్లకు నీటి అవసరం ఉందని వీలైనంత త్వరగా నీరు విడుదల చేయాలని పలువురు రైతులు కోరారు. కార్యక్రమంలో మేడికొండూరు మాజీ జడ్‌పిటిసి సభ్యులు పాములపాటి శివన్నారాయణ, వంకాయలపాడు నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు ఐనంపూడి నాగేశ్వరరావు, వర్క్ ఇనస్పెక్టర్ బాబూరావు, లస్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నింటా రాణించాలి

మంగళగిరి (ఆత్మకూరు),జనవరి31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు తమకు నచ్చిన రంగాల్లోనూ రాణించినట్టయితే జీవితంలో వారు అనుకున్న లక్ష్యాలను చేరుకుంటారని నిర్మల పాఠశాల ప్రిన్సిపాల్ జ్ఞానసౌందరి అన్నారు. మంగళగిరి మండలం ఆత్మకూరు నిర్మల ఇంగ్లీషు మీడియం పాఠశాలలో శుక్రవారం 2024-25 సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. సాంస్కృతికం, సాహిత్యం, క్రీడా విభాగాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జాన్‌పాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ నోట్ల వ్యాపారం పేరిట ఘరానా మోసం

మంగళగిరిసిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వక్రమార్గంలో డబ్బు సంపాదించాలన్న దుర్బుద్ధితో నకిలీకరెన్సీ చలామణి చేసేందుకు సిద్ధమైన భార్యాభర్తలు... నకిలీ నోట్ల ముఠా దెబ్బకు దారుణంగా మోసపోయారు. మంగళగిరిలో చోటు చేసుకున్న ఈ ఘటన తాలూకు వివరాలను రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు వెల్లడించారు. గుంటూరు జిల్లా పేరేచర్లలోని ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న ఖాదర్‌వలి, నాగుర్‌వలి చిత్తూరు జిల్లా తిరుచానూరులోని ఓ మహిళకు పరిచయమయ్యారు. ఈ క్రమంలో నకిలీ నోట్ల వ్యవహారాన్ని ప్రస్తావించి తక్కువ పెట్టుబడితో రెట్టింపు డబ్బులు వస్తాయని ఆశచూపి నకిలీ కరెన్సీ వ్యాపారం వైపు పురిగొల్పారు. దీంతో అత్యాశకు లోనైన తిరుచానూరులోని పగడాల జ్యోతి దంపతులు నకిలీ నోట్ల వ్యాపారం వైపు మొగ్గు చూపారు. రూ.15లక్షల అసలు నోట్లు ఇస్తే రూ.30 లక్షల విలువైన నకిలీ నోట్లు ఇస్తామని చెప్పి శనివారం వేకువజామున మంగళగిరి మండలం కాజ టోల్‌ప్లాజా వద్దకు రావాలని సూచించారు. దీంతో తిరుచానూరు నుంచి వచ్చిన జ్యోతి దంపతులు తాము తెచ్చిన రూ.15 లక్షల అసలు నోట్లను ఖాదర్‌వలి, నాగుర్‌వలిలకు అందజేశారు. ఆ వెంటనే దుండగులు నకిలీ నోట్లను పెట్టిన సూట్‌కేసును ఇచ్చారు. ఆ దంపతులు నోట్లను చూచుకుని, లెక్కించే సమయం కూడా ఇవ్వకుండా పోలీసులు వస్తున్నారంటూ హడావుడి చేసి వారిని అక్కడి నుంచి పంపించి వేశారు. కొద్దిసేపటి తర్వాత సూట్‌కేసు తెరిచిన బాధితులు తెల్ల నోట్ల కట్టలను చూచి అవాక్కయ్యారు. తాము మోసపోయామని గ్రహించిన బాధితులు మంగళగిరి రూరల్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ నకిలీ నోట్ల వ్యవహారంలో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని రూరల్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్

ఎన్నికల హామీలను అమలు చేయాల్సిందే

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్

మంగళగిరి సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాల్సిందేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళగిరి సీపీఐ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం జరిగిన ఏరియా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో అనేక వాగ్దానాలు చేసిన సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయలేమని చెప్పడం సరికాదన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వాలు వుంటే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. ప్రజలకు హామీలు ఇచ్చేటప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గుర్తులేదా అని ప్రశ్నించారు. జగన్ ప్రభుత్వం మాదిరిగానే రాష్ట్రాన్ని అప్పుల పాల్జేసి పరిపాలిస్తున్నారని విమర్శించారు. సీపీఐ ఏరియా కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలో 20 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తామని చెప్పిన హామీని నెరవేర్చాలని, ఇళ్లులేని పేదలకు స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్‌రావు, నేతలు చిన్ని సత్యనారాయణ, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కంచర్ల కాశయ్య, నందం బ్రహ్మేశ్వరరావు, జాలాది జాన్‌బాబు, బత్తూరి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ హరిబాబు

ఎన్నికల నియమావళిని అనుసరించండి

- మేడికొండూరు తహసీల్దార్ హరిబాబు

మేడికొండూరు, జనవరి31 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజక వర్గానికి ఎన్నిక జరగనున్నందున అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నియమావళిని అనుసరించాలని మేడికొండూరు తహసీల్దార్ హరిబాబు సూచించారు. మేడికొండూరులో శుక్రవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీల వారీగా ఎటువంటి కార్యక్రమాలు చేపట్టవద్దని, ఫ్లెక్సీలు కట్టడం, జండాలు ఏర్పాటు చేయడం వంటివి చేపట్టవద్దని కోరారు. ఎన్నికల కోడ్ ముగిసే మార్చి3వ తేదీ వరకు అనుమతి లేకుండా ఎటువంటి సభలు, సమావేశాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టరాదని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి తరఫున మాజీ జడ్‌పిటిసి సభ్యులు పాములపాటి శివన్నారాయణ, జనసేన పార్టీ తరఫున మండల పార్టీ అధ్యక్షులు రాచర్ల నాగబాబు, కందుల సైదయ్య, సిపిఎం తరఫున జిల్లా రైతు సంఘం కార్యదర్శి బొట్ల రామకృష్ణ తదితరులు హాజరు కాగా వైసీపి తరఫున ఎవరూ హాజరు కాలేదు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకుందాం

- పార్టీ నాయకులు, కార్యకర్తలు సహకరించాలి

వట్టిచెరుకూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి నిబంధనలకు లోబడి ఎన్నికల ప్రచారం, ఓటు హక్కు వినియోగం ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు పార్టీల మండల స్థాయి నాయకులు కృషి చేయాలని డిప్యూటీ తహసీల్దార్ దరియావలి, ఎంపీడీవో రమేష్ బాబు సూచించారు. మండలంలోని 17 గ్రామాలకు సంబంధించి పట్టభద్రులు 1137 మంది ఓటర్లు ఉన్నారనీ, వట్టిచెరుకూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఓటర్లను ఆకట్టుకోవటంగానీ, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రచారం నిర్వహించటంగానీ నిబంధనలకు విరుద్ధమన్నారు. 1137 మంది ఓటర్లలో 757 పురుషులు, 380 మంది మహిళా ఓటర్లు ఉన్నారన్నారు. ఎన్నికలు జరిగే వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రాజకీయ పార్టీల నాయకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో టీడీపీ, వైసీపీ, బీజేపీ, బహుజన పార్టీ, జనసేన, బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

ఏసీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

తాడేపల్లి టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏసీసీ సిమెంటు కార్మికులు చేస్తున్న రిలే దీక్షలు శుక్రవారంతో 58వ రోజుకు చేరుకున్నాయి. ఈ రిలే దీక్షలను సీఐటియూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, ఏసీసీ కార్మిక పోరాట కమిటి కన్వీనర్ కూరపాటి స్టీవెన్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ ఆకలి కేకలతో, మానసిక వేదనకు గురై ఇబ్బందులు పడుతున్న ఏసిసి కార్మికుల సమస్యను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఈ దుస్థితికి పాలకులే కారణమన్నారు. మంచి మెజారిటీతో అందలం ఎక్కిస్తే కార్మికుల పట్ల మంత్రి నారా లోకేశ్ నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని అన్నారు. గత ఎన్నికల ప్రచారంలో నారా లోకేశ్ కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. ఈ దీక్షల్లో ఉప్పు చినరామయ్య, ఆదినారాయణ, పిచ్చయ్య, వై సాంబయ్య, బి దానయ్య కూర్చున్నారు. ఈ కార్యక్రమానికి మద్దతుగా స్టీవెన్, బి సూర్యప్రకాష్, రమాదేవి, దుర్గాభవాని, రమణ, వై యెహోషువ, ఎస్‌కె బాష, నాగేశ్వరరావు, శారద, శారమ్మ, సామ్రాజ్యం, శివ నాగలక్ష్మి, దర్శి మాణిక్యాలరావు, పాల్గొన్నారు.



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

మహిళ మెడలో గొలుసు చోరీ

తెనాలి, మారీసుపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో గొలుసు చోరీచేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక పాండురంగపేటకు చెందిన ఉయ్యూరు లక్ష్మి ఒక ప్రైవేటు కళాశాలలో టీచర్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 27న విధులు ముగించుకొని ఆటోలో ఇంటికి వెళ్లేందుకు చెంచుపేటలో దిగింది. అక్కడ నుంచి నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న క్రమంలో వెనుక నుంచి ద్విచక్రవాహనంపై గుర్తుతెలియని వ్యక్తి మెడలోని బంగారు గొలుసును తెంచుకొని పరారయ్యాడు. శుక్రవారం బాధితురాలి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.



పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి మనోహర్

ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తా

● మంత్రి మనోహర్

తెనాలి రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలు తనకు తెలిపిన ప్రతి సమస్యను సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి మనోహర్ చెప్పారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని పలువురి నుంచి మంత్రి మనోహర్ అర్జీలు స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలువురు జనసేన పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నిడుబ్రోలులో వైద్య శిబిరం

పొన్నూరు టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిడుబ్రోలు బాలాజీ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ షేక్ అస్మా ఆధ్వర్యంలో 85మంది స్త్రీలను పరీక్షించి పలు సూచనలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అన్నక్యాంటీన్‌లో ప్లేట్ల శుభ్రతను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

పరిసరాల పరిశుభ్రతలను పాటించండి

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్‌లో పరిసరాల పరిశుభ్రతలను పాటించాలని, రుచికరమైన ఆహారాన్ని అందించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. శుక్రవారం బస్టాండ్ సెంటర్‌లోని అన్న క్యాంటీన్‌ను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆకస్మికంగా తనిఖీచేసి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. క్యాంటీన్‌లో అందిస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయండి: అన్నాబత్తుని

తెనాలి రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరికీ భరోసాగా ఉంటూ వైసీపీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివ కుమార్ అన్నారు. శుక్రవారం తెనాలి వైసీపీ కార్యాలయానికి ఆ పార్టీ జిల్లా కమిటీ అధికార ప్రతినిధిగా నియమితులైన కొడాలి క్రాంతికుమార్, యాక్టివిటీ సెక్రటరీగా నియమితులైన తాడిబోయిన యలమందరావులు మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ నియామకానికి కృషిచేసిన శివ కుమార్‌ను దుశాలువాలతో సత్కరించారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ వృద్ధాశ్రమంలో శుక్రవారం పేదలకు అన్నదానం చేశారు. శ్రీవాసవీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం పురస్కరించుకుని అమరజీవి పొట్టిశ్రీరాములు, పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు పొట్టి శంకరనారాయణ, ఆలపాటి శివ, బాల గణేష్, నరసింహారావు, రమేష్, జితేంద్ర, నర్సింగరావు పాల్గొన్నారు.

డీజీపీకి కేసన సత్కారం

తెనాలి అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నేరాలను అరికట్టి గంజాయి డ్రగ్స్ వాడకాన్ని నిర్మూలించేందుకు రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు విశేష కృషి చేశారని, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. శుక్రవారం పదవీ విరమణ చేసిన డీజీపీని కలిసి ఘనంగా సన్మానించినట్లు తెలిపారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను పరిరక్షించేందుకు జటిల సమస్యలను పరిష్కరించేందుకు ఆయన పాటుపడ్డారని, గంజాయి, డ్రగ్స్ వాడకంపై నిరంతరం నిఘాపెట్టి నేరాల సంఖ్యను కూడా గణనీయంగా తగ్గించారని ప్రశంసించారు. ఆయన పనితీరును మెచ్చి ఆర్టీసీ ఎండీగా నియమించాలనే నిర్ణయంపై ముఖ్యమంత్రి ప్రజా పాలనకు నిదర్శనమన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి

తెనాలి రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రజాయుద్ధనౌక గద్దర్ జయంతి సందర్భంగా తెనాలిలో శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో అధ్యక్షుడు అక్కిదాసు కిరణ్‌కుమార్, కుర్రాజస్వంత్ యాదవ్, దుబాయిబాబు, జేసుబాబు, బాజీ, అరుణ్‌కుమార్, ఖాదీమస్తాన్, శరత్, బాబి, సిద్దిక్, రమేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

వాసవీ అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ

తెనాలి అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం రాష్ట్ర ప్రభుత్వ అధికారిక కార్యక్రమంగా ఘనంగా నిర్వహించారు. బోసురోడ్డులోని ఆలయానికి రాష్ట్ర పౌరసరఫరాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్ శుక్రవారం పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు మేళతాళాలు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మంత్రి పాల్గొన్నారు. వేకువ జామున కమిటీ సభ్యులు పతాకాన్ని ఆవిష్కరించారు. 108 మంది ఆర్య వైశ్య కన్యలు కలశాల ఊరేగింపు నిర్వహించి ఆలయానికి చేరుకున్నారు. మంత్రి మనోహర్ మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ప్రభుత్వ అధికారిక కార్యక్రమంగా ప్రతిఏటా నిర్వహిస్తామని ప్రకటించారని చెప్పారు. ఈ మేరకు అమ్మవారికి పూజలు చేసే భాగ్యం కూటమి ప్రభుత్వ నాయకులకు కూడా కలిగిందన్నారు. ఆర్యవైశ్యులు ఐక్యమత్యంగా ఉంటారని, సమాజానికి ఎన్నో సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు.



అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న మంత్రి మనోహర్

ఆలయ కమిటీ అధ్యక్షుడు నూకల వేణుగోపాలరావు, కార్యదర్శి బూర్లె నరసింహారావు, కమిటీ సభ్యులు, అర్చకులు మంత్రికి స్వాగతం పలికారు. అమ్మవారిని అలంకరించిన రథంపై ఉంచి ఘనంగా ఊరేగించారు.

పొన్నూరులో...

పొన్నూరు టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో గాయత్రి హోమం భక్తి శ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు కారుమూరి ప్రకాష్, నాయకులు, ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో
కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం



పొన్నూరులో ప్రత్యేక పూజలు అందుకున్న శ్రీవాసవి మాత

సాదాసీదాగా అత్యవసర సమావేశం



కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, అధికారులను ప్రశ్నిస్తున్న టీడీపీ కౌన్సిలర్ త్రిమూర్తి

తెనాలి, మారీసుపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ అత్యవసర కౌన్సిల్ సమావేశం సాదాసీదాగా ముగిసింది. శుక్రవారం పురపాలక సంఘ అత్యవసర సమావేశాన్ని కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అజెండాలోని 4 అంశాలపై కౌన్సిల్ ఎదుట తీర్మానినికి ఉంచారు. మొదటి అంశం మున్సిపల్ షాపుల అద్దె పెంపుదలపై చర్చకు రాగా టీడీపీ కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి నిలబడి సాధారణ సమావేశం కాకుండా అత్యవసర సమావేశాన్ని నిర్వహించడం ఏమిటని చైర్‌పర్సన్ రాధికను ప్రశ్నించారు. కమిషనర్ బండి శేషన్నను దీనిపై సమాధానం చెప్పాలని చైర్‌పర్సన్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశామని కమిషనర్ శేషన్న తెలిపారు. ఇదే క్రమంలో 11వ వార్డు కౌన్సిలర్ కఠారి రత్నకుమారి మాట్లాడుతూ తమ వార్డులోని పూలే కాలనీలో తాగునీటి పైపులైన్ ఎప్పుడు వేస్తారని ప్రశ్నించారు. దీనికి సమాధాన మిస్తూ ఏఈ సునీల్ కుమార్ త్వరలోనే తాగునీటి పైప్ లైన్ పనులను ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం అజెండాలోని అన్ని అంశాలను ఆమోదిస్తున్నట్లు చైర్‌పర్సన్ రాధిక ప్రకటించారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, కౌన్సిల్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశానికి ఆలస్యంగా వచ్చిన చైర్‌పర్సన్

పురపాలక సంఘ అత్యవసర సమావేశం శుక్రవారం ఉదయం గం.11లకు కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన నిర్వహించాల్సి ఉంది. కాగా కౌన్సిల్ సభ్యులు సమయపాలన పాటిస్తూ కౌన్సిల్ సభకు హాజరుకాగా చైర్‌పర్సన్ మాత్రం 40ని. ఆలస్యంగా రావటంపై కౌన్సిల్ సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. 33వ వార్డు వైసీపీ కౌన్సిలర్ మొగల్ రహమత్ బేగ్ పురపాలక సంఘ అభివృద్ధికి ముందుండాల్సిన చైర్‌పర్సన్ ఆలస్యంగా రావడంపై నిరసన వ్యక్తం చేస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు.

అమరావతిని రాజధానిగా చట్టం రూపొందించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి యార్లగడ్డ నేతాజీ

తెనాలి అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం రాజధానిపై మూడు ముక్కలాట ఆడిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమరావతి రాజధానిగా వెంటనే పటిష్ఠమైన చట్టం రూపొందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి యార్లగడ్డ నేతాజీ పేర్కొన్నారు. నెల్లూరు మహాసభల నేపథ్యంలో తాడేపల్లి నుంచి వెళుతున్న ప్రచారజాత శుక్రవారం తెనాలి మార్కెట్ సెంటర్‌కు చేరుకుంది. అక్కడ జరిగిన ప్రదర్శనలో ఆయన మాట్లాడుతూ, ప్రజలపై మోపిన విద్యుత్ భారాన్ని వెంటనే తగ్గించాలని, రాజధాని నిర్మాణానికి అప్పు కాకుండా కేంద్రం నుంచి రావాల్సిన నిధులను హక్కుగా తీసుకురావాలని కోరారు. రాజధాని నిర్వహణ పనులను స్థానికులకు అప్పగించాలని, పంట సాయం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలుపుతున్నట్లు స్పష్టమైన ప్రకటన చేయాలని, కూటమి నాయకులు ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేనిపక్షంలో ఉద్యమాలకు సిద్ధమవుతామన్నారు. భావన్నారాయణ, రవి, బాబుప్రసాద్, వెంకటేశ్వరరావు, శివసాంబిరెడ్డి, రవీందర్, హుస్సేన్‌వలి, వెంకటసుబ్బయ్య, రాజ్యలక్ష్మి, కిన్నెర, శివకుమారి, సుబ్బారావు పాల్గొన్నారు.



తెనాలిలో జరిగిన ప్రదర్శనలో పాల్గొన్న సీపీఎం నాయకులు

రాజధానికి కేంద్ర ప్రభుత్వమే నిధులు సమకూర్చాలి

పొన్నూరు టౌన్, జనవరి31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వమే నిధులు సమకూర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బూరగ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం ప్రచార జాత పొన్నూరు వచ్చింది. పట్టణంలో ప్రదర్శన నిర్వహించిన జాత సభ్యులు మాట్లాడుతూ ప్రజోపకర రాజధానిని నిర్మించాలన్నారు. అందుకు అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వమే సమకూర్చాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల పేరుచెప్పి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. భవిష్యత్తులో రాజధాని నిర్మాణం అంశంపై అనిశ్చితి తలెత్తకుండా సమగ్ర చట్టం తేవాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం తెలుగుదేశం పార్టీపై ఆధారపడి మనుగడ సాగిస్తున్నందున రాజధాని నిర్మాణానికి నిధులు డిమాండ్ చేయాలని కోరారు. పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాజధాని ప్రాంత కార్యదర్శి ఎం.రవి, రాష్ట్ర నాయకులు వై నేతాజీ దండా లక్ష్మీనారాయణ, ప్రభుదాస్, నిమ్మకూరు రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కోసం విస్తృత ఏర్పాట్లు

పొన్నూరు టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక కోసం పొన్నూరు పట్టణంలో పోలింగ్ కేంద్రాల వద్ద విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ జియావుల్ హక్ తెలిపారు. శుక్రవారం పొన్నూరు పట్టణంలోని ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ పరిశీలించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పొలిటికల్ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధలను అనుసరించాలన్నారు. సమావేశంలలో కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు, అర్బన్ సీఐ రవికిరణ్ పాల్గొన్నారు.



అత్తోటలో ప్లెక్సీలు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

ఎన్నికల నియమావళి పాటించాలి: తహసీల్దార్

కొల్లిపర, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని తహసీల్దార్ సిద్ధార్థ అన్నారు. శుక్రవారం పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, కటౌట్‌లు, బ్యానర్లు తొలగించాలని ఆర్ఐ, వీఆర్వోలకు, వీఆర్ఏలకు ఆదేశించారు. విగ్రహాలకు ముసుగులు వేయాలన్నారు.

పేదలకు సేవ చేయడమే నిజమైన దైవ మార్గం: ధూళిపాళ్ల

చేబ్రోలు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పేదలకు సేవ చేయడమే నిజమైన దైవ మార్గమని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. చేబ్రోలు మండలం గురువుపాలెంలో శుక్రవారం ఒలీవల ప్రార్థనా మందిరం 22వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. హార్వెస్ట్ ఇండియా అందించిన దుప్పట్లు ఎమ్మెల్యే నరేంద్ర కుమార్, జడ్పీ చైర్ పర్సన్ హెన్రీ క్రిస్టియన్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మైలా వెంకట రామరాజు, అనంతలక్ష్మి నారాయణ, మాజీ ఎంపీపీ ఖాదర్ బాష, ఎంపీటీసీ సూరగాని గోవిందు, మేడికొండ నరేష్ తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టీనా

సచివాలయం కార్యదర్శి రాజేష్ నాయుడుకు డాక్టరేట్

కొల్లిపర, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపర సచివాలయంలో గ్రేడ్-6 పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఆరే రాజేష్ నాయుడుకు కేఎల్ యూనివర్సిటీ విభాగం నుంచి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో నోవెల్ అప్రోచెస్ ఫర్ డిటెక్షన్ ఆఫ్‌డీ ఎఫ్‌యూ అండ్ బ్రెయిన్ ట్యూమర్ త్రూ ఇమేజ్ ఫ్యూజన్ అనే అంశంపై డాక్టరేట్ లభించింది. దీంతో శుక్రవారం రాజేష్‌నాయుడును డెమోక్రటిక్ అసోసియేషన్ ఆఫ్ గ్రామవార్డు సచివాలయం ఎంప్లాయిస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు బండికళ్ళ సతీష్, పంచాయతీ కార్యదర్శులు దీనరాజు, రామ్మోహన్, రవిబాబు, ప్రదీప్, రాజీవ్, సచివాలయం సిబ్బంది సన్మానించి అభినందనలు తెలియజేశారు.



డాక్టరేట్ సాధించిన రాజేష్‌నాయుడును సన్మానిస్తున్న సచివాలయం ఉద్యోగులు

కళా ప్రదర్శనలో ఏఎన్‌యూ విద్యార్థుల ప్రతిభ

పెదకాకాని, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తమ కళా ప్రదర్శనలు ఇచ్చి ప్రతిభను నిరూపించుకున్నారు. ఇటీవల జాతీయస్థాయిలో కెమిల్ ఫౌండేషన్, కర్ణాటక యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ విజువల్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్వహించిన ఆర్ట్స్ క్యాంపు, ఎగ్జిబిషన్‌లో ఏఎన్‌యూ విద్యార్థులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాల నుంచి ఎంపికచేసిన 120 మంది కళాకారులు ఐదు రోజుల హార్ట్ క్యాంప్‌లో చిత్రించిన చిత్రాలను జనవరి 20 నుంచి 26 వరకు ముంబాయిలోని సుప్రసిద్ధ ఆర్టిక గ్యాలరీలో ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో యూనివర్సిటీ ఫైన్ ఆర్ట్స్ చివరి ఏడాది విద్యార్థి సాధు సోనీదాస్‌కు ప్రతిభా పురస్కారం లభించింది. అలాగే ఇటీవల ఒడిశా ప్రభుత్వం కోణార్క్‌లోని చంద్రబాగ్ బీచ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ శాండ్ ఆర్ట్ ఫెస్టివల్‌లో 11 దేశాల నుంచి 150 మంది విద్యార్థులు సైకత శిల్పాల పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో ఏఎన్‌యూ విద్యార్థి వాటుపల్లి గోపీచంద్ చేసిన వేంకటేశ్వరస్వామి సైకత శిల్పం విశేషంగా ఆకట్టుకుంది. ఈ చిత్రానికి ప్రతిభా పురస్కారం లభించింది. ఈ సందర్భంగా సోనిదాస్, గోపీచంద్‌లను వీసీ ఆచార్య కె.గంగాధరరావు అభినందించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్ విద్యార్థులను అభినందిస్తూ అమరావతి రాజధాని చరిత్రను కళారూపాలుగా రూపొందించాలని కోరారు. దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, ఫైన్ ఆర్ట్స్ విభాగం అసిస్టెంట్ కోఆర్డినేటర్ దేవకాంత్, అధ్యాపకులు జాన్ రత్నబాబు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● మండల న్యాయ సేవా కేంద్రం చైర్మన్ పవన్ కుమార్

పొన్నూరు టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవా కేంద్రం చైర్మన్ మెజిస్ట్రేట్ ఏ పవన్ కుమార్ అన్నారు. శుక్రవారం సివిల్ కోర్టులో మండల న్యాయ సేవా కేంద్రం సమావేశం జరిగింది. సమావేశంలో మెజిస్ట్రేట్ పవన్‌కుమార్ మాట్లాడుతూ అధికారులు తమ పరిధిలోని రాజీ పడదగిన కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కారం చూపించాలని సూచించారు.

హెల్మెట్ ధారణతో ప్రాణ రక్షణ: ఎంవీఐ

పొన్నూరు టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరిస్తే ప్రమాద సమయంలో ప్రాణాలను రక్షించుకోవచ్చని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాఘవరావు అన్నారు. మండల పరిధిలోని నారాకోడూరులో ఓ ప్రైవేట్ సంస్థలో రోడ్డు ప్రమాదాలపై శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంవీఐ రామారావు మాట్లాడుతూ గత ఏడాది 1042 రోడ్డు ప్రమాదాలు జిల్లాలో చోటు చేసుకున్నాయన్నారు. అందులో 869 క్షతగాత్రులు కాగా 439 మంది ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. ప్రమాదాలు నివారించడానికి రోడ్డు రవాణా సంస్థ నిబంధనలు పాటించాలని సూచించారు.

శివాజీ చౌక్‌లో అన్నదానం

తెనాలి అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాజీ చౌక్‌లో శుక్రవారం పేదలకు అన్నదానం చేశారు. కాళీమాత ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మడి రమేష్, గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆధ్యాత్మిక సేవ కార్యక్రమాల్లో కమిటీ ముందుందని మురళి పేర్కొన్నారు. శ్రీనివాసరావు, దినేష్, వెంకటేశ్వర్లు, సీతారామయ్య, గోపి, మాదల కోటేశ్వరరావు పాల్గొన్నారు.



ఆసుపత్రిలో విచారణ చేస్తున్న సెకండరీ హెల్త్ జాయింట్ డైరెక్టర్ రమేష్ కిషోర్

మహిళ మృతిపై సెకండరీ హెల్త్ జేడీ విచారణ

తెనాలి రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కుటుంబ నియంత్రణ ఆపరేషన్ వికటించి మహిళ మృతిచెందిన ఘటనపై తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాలలో విచారణ చేపట్టారు. శుక్రవారం సెకండరీ హెల్త్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.రమేష్‌కిషోర్ వైద్యశాలలోని తల్లీపిల్లల విభాగంలో ఆపరేషన్ చేసిన వైద్యులు, అధికారులతో ప్రత్యేక సమావేశం జరిపారు. పేషెంట్ ఆసుపత్రికి వచ్చిన నాటి నుంచి అందించిన వైద్యం, చేసిన శస్త్ర చికిత్స తదితర విషయాలను వారి నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో రమేష్ కిషోర్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలతో విచారణ చేపట్టామన్నారు. జీజీహెచ్‌లో కూడా వైద్యం అందించిన తీరు మృతికి గల కారణాలను విచారణ జరిపి అనంతరం సమగ్ర నివేదికను అందించడం జరుగుతుందని ఆయన చెప్పారు. జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ మజీదాబేగం, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, పలువురు వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

కిటకిటలాడిన రిజిస్ట్రేషన్ కార్యాలయం

● నేటి నుంచి పెరగనున్న చార్జీలు

తెనాలి అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తెనాలి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల హడావుడి కనిపించింది. రాష్ట్ర ప్రభుత్వం ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువలను ఫిబ్రవరి 1 నుంచి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పలువురు కొనుగోలు, అమ్మకాలకు సంబంధించి సబ్ రిజిస్టర్ కార్యాలయానికి రావడంతో కార్యాలయ ఆవరణలో కోలాహలం నెలకొంది. రెండు రోజులలో 100కు పైగా రిజిస్ట్రేషన్లు జరిగినట్లు సబ్ రిజిస్టర్ కె.బుజ్జిబాబు చెప్పారు. పట్టణంలో కమర్షియల్ ప్రాంతాల్లో గజం భూమి ధర రూ.50 వేలు ఉన్న విలువ పెంపు కారణంగా రూ.60 వేలకు చేరింది. ప్రాంతాన్ని బట్టి విలువలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెంచామని, కొన్ని ప్రాంతాల్లో పెంపుదల లేదని వివరించారు. ఆస్తులు కొనుగోలు చేసిన వారు పెరిగిన విలువల కారణంగా చెల్లించాల్సిన రుసుము పెరగడంతో ఫిబ్రవరిలో రిజిస్ట్రేషన్ చేయాల్సిన వారంతా డబ్బులు చెల్లించి ముందుగానే జాగ్రత్తపడ్డారు. ఆస్తుల విలువ పెంపుదల ప్రభావం పడటంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సర్వర్ నెమ్మదించింది. దీంతో రాత్రి 10 గంటల వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగింది.

వాట్సప్‌లో ధ్రువీకరణ పత్రాలపై అవగాహన

తెనాలి, మారీసుపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జనన మరణ ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టనున్న వాట్సప్ గవర్నెన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం పట్టణ పురపాలక సంఘ కార్యాలయంలో పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి అధికారులకు జనన, మరణాల ధ్రువీకరణ పత్రాలు వాట్సప్ ద్వారా ఇవ్వటంపై అవగాహన కల్పించారు. వాట్సప్ ద్వారా ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు పంపించే విధానంపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల, ఐటీ టీం సభ్యులు అనిల్, రాజేష్, విశ్వం, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి, పక్కన కమిషనర్ శేషన్న తదితరులు

ఉర్దూ పాఠశాల రద్దుపై కొల్లిపరలో నిరసన

కొల్లిపర, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపర ముస్లిం కాలనీలో ఆరు దశాబ్దాల నుంచి విద్యనందిస్తున్న ఉర్దూ పాఠశాలను రద్దు చేసి దాని సమీపంలో ఉన్న తెలుగు మీడియం పాఠశాలలో విలీనం చేయడంపై శుక్రవారం ముస్లిం నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎంఈవో కార్యాలయంలో విద్యాశాఖాధికారులు సాల్మన్‌రాజు, ఝాన్సీలత, ఎంపీడీవో కార్యాలయంలో పరిపాలనాధికారి ప్రతాప్‌రెడ్డికి ముస్లిం నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు వినతి పత్రాన్ని అందజేశారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో షేక్ రఫీ, షేక్ అహిజుల్లా, షేక్ అబ్దుల్లా, పఠాన్ ఫిరోజ్‌ఖాన్, షేక్ మస్తాన్, షేక్ హెసాన్, షేక్ రహీమ్, షేక్ మాలిబాషా తదితరులు ఉన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

తెనాలి, మారీసుపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీచౌక్‌లో శుక్రవారం జరుగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న క్షేత్రస్థాయిలో అధికారులతో కలసి పరిశీలించారు. సుందర తెనాలికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.